# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



సంపుటి 32 సంచిక 11

పేజీలు 40

జులై 2013

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M

చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన

చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| యోగవాశిష్ఠము | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| తగిన వారసులెవరు? | 14 |
| పరిప్రశ్నేన సేవయా | 16 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 17 |
| ధ్యానం ఎందుకు చేయాలి? | 19 |
| ధర్మో రక్షతి రక్షితః | 21 |
| కోతులు పట్టేవాడు | 23 |
| భక్తిభావనయే సర్వోత్కృష్ట సాధన | 25 |
| సూరదాస్ కె భజన్ | 27 |
| భగవానుడు సర్వవ్యాపి | 28 |
| కాలాతీతుడు | 30 |
| మానవ నైజం | 33 |
| సజ్జన సాంగత్యం | 34 |
| శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు | 35 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 36 |
| శ్రీరాధామాధవ రస సుధ | 38 |
| విష్ణు కథలు | 39 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

దేహబుద్ధ్యాస్మి దాసోzహం జీవబుద్ధ్యాత్వదంశకః
ఆత్మబుద్ధ్యా త్వమేవాzహమితి మే నిశ్చితామతిః

సకలవేదములు, సకల శాస్త్రములు, పురాణములు, భారత భాగవతాది గ్రంథములు తెలియజేయు అతి రహస్యమైన పరబ్రహ్మతత్వ జ్ఞానమును తారక సాంఖ్యామనస్క యోగాచార్యుడైన శ్రీరామచంద్రుని ద్వారా ఉపదేశమును పొంది, అమితానంద భరితుడై శ్రీసీతారాములకు వందనము చేసి, కర కమలములను మోడ్చి శ్రీ ఆంజనేయుడు పలికిన పలుకులు.

శ్రీ ఆంజనేయస్వామి శ్రీరామచంద్ర మూర్తిని ఉద్దేశించి మాట్లాడుతూ



ఆత్మజ్ఞానహీనుడనై, దేహభావనతో శరీరమే నేనని భావించినప్పుడు నేను నీ దాసుడను, నీవు నా ప్రభువు, దానికి భిన్నముగా యీ శరీరము, యింద్రియములు, ప్రాణము, మనస్సు, అహంకారము నశించునవి. నేను మాత్రము నిత్యుడను, నశించువాడను కాను.

నేను యీ దేహేంద్రియాదుల వికారమును గమనించు కూటస్థుడను అను జ్ఞానము కలిగినప్పుడు నేను కేవలము నీ అంశనే అని భావించెదను.

ఇంకనూ పరిపూర్ణ జ్ఞానము కలిగి నేను గుణరహితుడను, నిష్క్రియుడను, చిదానందుడను, శాశ్వితుడను అని దృఢమైన భావన కలిగినప్పుడు నాకునూ నీకునూ భేదము లేదు.

ఉపాధి భావన తొలగినప్పుడు ఘటాకాశాము, మహాకాశములోనిదే కదా. జీవాత్మ పరమాత్మకు భిన్నముగా ఉందా?

అట్టి భావన పొందటానికి శ్రీరామనామ జపపరాయణుడును, శ్రీరామచంద్ర తత్వ అవలోక నిరతిశయ, నిర్వికల్ప సమాధి నిష్ఠుడై, జీవన్ముక్తి సుఖం అనుభవించు శ్రీ ఆంజనేయ స్వామికి సాధ్యముకాక, మరెవరికి సాధ్యము?

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

35. ఖరము పాలుతెచ్చి కాచి చక్కెఱ వేయ
భక్ష్యమగునె యెన్న భ్రష్టుఁడట్లె
యెంత చెప్పి చివరనెసఁగినఁ బొసుఁగునే?
విశ్వదాభిరామ వినురవేమ!



తాత్పర్యము -

గాడిదపాలు తెచ్చి చక్కెరవేసిననూ త్రాగుటకు యోగ్యము కావు. అట్లే వివేకశూన్యుడు ఎంత చెప్పినను ఉపయోగమునకు రాదు.

36. గాడ్దెమేనుమీద గంధంబు పూసిన
బూదిలోనఁ బడుచుబొరలు మరల
మోటువాని సొగసు మోస్తరియ్యది సుమీ
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యము -

సువాసన గల గంధమును ఒడలికి పూసినను గాడిద బూడిదలో పొరలునే గాని నీటుగా ఉండదు. మోటువాని సొగసు యీ రీతినే ఉండును.

37. గ్రుడ్డువచ్చి పిల్ల గోరడాలాడిన
విధముగా నెఱుఁగక వెఱ్ఱి జనులు
జ్ఞానులైనవారి గర్వింతు రూరక
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యము -

జ్ఞానములేని మూర్ఖులు జ్ఞానులను నిందించుట. గ్రుడ్డు వచ్చి పిల్లను వెక్కిరించి నట్లుండును.



# శ్రీబాబూజీ ఉవాచ

– పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ " మాతృదేవోభవ, పితృదేవోభవ" అన్నది యదార్థమే. తల్లిదండ్రుల మాట శిరసావహించవల్సిందే. తల్లిదండ్రుల సేవచేసిన పుండరీకుడు తరించిన మాట వాస్తవమే. అంత ఎందుకు? తల్లిదండ్రులనే దైవంగా భావించిన వారంతా తప్పక కృతార్థులవుతారు. సందేహంలేదు". అని ఇద్దరు పండితుల సందేహాలకు సమాధానంగా చెప్పారు.

శ్రీబాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ తల్లిదండ్రులమాట శిరసావహించకుండా తన తండ్రిమాట నిర్లక్ష్యంచేసి నారాయణ స్మరణ చేసిన ప్రహ్లాదుడు ఎలా భక్తుడనిపించుకుంటాడు? అనికదా మీరు నన్ను ప్రశ్నించింది. శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ మీరంతా చదువుకున్నవారు, పండితులు, మీరు ఉదహరించిన మాతృదేవోభవ, పితృదేవోభవ అన్న శ్లోకంలో "ఆచార్యదేవోభవ" అన్నది మర్చిపోతే ఎలాగూ? ప్రహ్లాదుడు భక్తుడు కాదని ఎవరు అనగలరు? అసురప్రవృత్తి ఉన్నవారు మినహా ఎవరైనా ప్రహ్లాదుడిని భక్తునిగానే గౌరవిస్తారు.



ప్రహ్లాదుని చరిత్ర మీకు తెలుసు కదా! మాతృగర్భంలో ఉండగానే నారద మహర్షి ద్వారా నారాయణ మంత్రోపదేశం పొందాడు. ప్రహ్లాదుడు గురువాజ్ఞాపాలనను శిరసావహించిన భక్తులలో అగ్రగణ్యుడు. ఇప్పుడు చెప్పండి. ప్రహ్లాదుడు నారాయణ నామస్మరణ చేయటంలో తప్పేమిటి? తల్లిదండ్రులను ఎట్లు అగౌరవపరచినట్లు అవుతుంది? గురుగీత స్పష్టంగా "గురుమూర్తిం స్మరేనిత్యం, గురోర్నామ సదాజపేత్ గురోరాజ్ఞాం ప్రకుర్వీత గురోరన్య న భావయేత్!" అని చెప్పబడేది శాస్త్ర వాక్యమే కదా! ఇంకా గురువుని మించిన దైవం వేరేలేదు.

గురుమూర్తి సర్వదేవతాస్వరూపుడు, త్రిమూర్తి స్వరూపుడు, శక్తిస్వరూపుడు ఆయనను ఆరాధిస్తే సమస్త దేవతలకు అందుతుంది అని శాస్త్రమే చెబుతుంది "నగురోరధికం, నగురోరధికం, నగురోరధికం, నగురోరధికం, శివశాసనతః, శివశాసనతః,శివశాసనతః,శివశాసనతః," అని కూడా శాస్త్రమే చెబుతోంది కదా! గురువంటే ఎవరు? సత్యస్వరూపుడు, ప్రేమస్వరూపుడు, శాంతి స్వరూపుడు, నిరాడంబరుడు అటువంటి సద్గురుమూర్తి ఉపదేశాన్ని కాదని అసుర ప్రవృత్తితో హిరణ్యకశిపుడు తన పుత్రుని కిచ్చిన ఆదేశాన్ని శిరసావహించాలా? అది

సత్యసమ్మతము, న్యాయసమ్మతము, ధర్మమైనదిగా అనిపిస్తోందా?" అని అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

ఇంకా మాట్లాడుతూ "అటువంటి అసుర ప్రవృత్తిగల వ్యక్తులు ఈ యుగంలో మాత్రంలేరా? ఒక వ్యక్తి స్నేహితులతో పేకాట ఆడటానికి వెళ్లినా, సినిమా చూడడానికి వెళ్లినా, డ్రింక్ సేవించడానికి వెళ్లినా, చుట్ట, బీడి, సిగరెట్ కాల్చినా అంగీకరిస్తారు. కాని అదే వ్యక్తి ఏదైనా పురాణ కాలక్షేపానికి గానీ, మహాత్ముల సందర్శనానికి వెడితే మావాడు సన్యాసుల్లో కలసి పోతున్నాడనో లేక ఇప్పటినుంచి వేదాంతం ఎందుకురా అనో మందలించి విమర్శించకుండా ఉంటారా? చూశారా మానవ ప్రవృత్తి ఎలా ఉంటుందో? సజ్జన ప్రవృత్తి గలవారు కష్టపడతారుగానీ, కష్టపెట్టరు. దుర్జనులు వారు కష్టపడరు కానీ యితరులను కష్టపెడతారు. సజ్జనుల వియోగం కష్టం కలిగిస్తుంది. దుర్జనుల సంయోగం కష్టం కలిగిస్తుంది.

ప్రహ్లాదుడు గురూపదేశం పొందక పూర్వం తల్లిదండ్రులెవరైనా మంత్రోపదేశం చేసినట్లైతే అదే గురోపదేశంగా ప్రహ్లాదుడు శిరసావహించవల్సిందే. అది శాస్త్రసమ్మతమే. కానీ ప్రహ్లాదుడు ముందుగా శ్రీ నారద మహర్షిద్వారా గురోపదేశం పొందాడు. కాబట్టి తప్పనిసరిగా సద్గురుమూర్తి ఆదేశాన్ని శిరసావహించవల్సిందే. ఆయన చెప్పినట్టు చెయ్యాలి. ఆయన అనుజ్ఞలేనిదే ఏ పని చేయకూడదు. గురవాజ్ఞాపాలనచేయనివాడు, ఆయన అనుజ్ఞకు భిన్నంగా చేసేవాడు. అనుభవించే పాప కర్మ త్రిమూర్తులు సహితం రహితం చేయలేరు. అది రహితం కావాలంటే తాను ఆశ్రయించిన గురుమూర్తి అనుగ్రహం పొందవల్సిందే" అని అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

*

## శ్రద్ధాంజలి

శ్రీ బాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు, అయిన నేలభట్ల ఆంజనేయ శర్మగారు 13-6-2013 గురువారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 77 సంవత్సరాలు. వీరికి ముగ్గురు కుమారులు, కోడళ్ళు, ఒక కుమార్తె, అల్లుడు, మనుమలు, మనుమరాళ్ళు కలరు.

సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# శ్రీ మాతాజీ అభిభాషణ

–జపమాలా ప్రసాద

పూజ్యశ్రీ యోగినీ చంద్రకాళీ ప్రసాద మాతాజీవారు 13-07-2004న స్పెయిన్ దేశంలోని బార్సిలోనా నగరంలో జరిగిన ప్రపంచ మతాల మహాసభలలో సి.సి.ఐ.బి బిల్డింగ్‌లోని 125 నెంబరు రూములో చేసిన అనుగ్రహభాషణమును ఇచ్చట పొందుపరచు చున్నాము. శ్రీమాతాజీవారు ధ్యాన ప్రక్రియను గురించి, ప్రార్ధన గురించి చిన్న చిన్న మాటలలో చెపుతూ, అచ్చటకు విచ్చేసిన వారందరిచేత కొద్దిసేపు ధ్యానం చేయించి, ప్రార్ధన చేయించారు. ఆ తరువాత ఆహూతులు వేసిన ప్రశ్నలకు సమాధానములిచ్చినారు. అవి కూడా ఇచ్చట పొందుపరచుచున్నాము.)




అందరికీ కూడా 'నేను' అంటే ఇష్టం. ఆ 'నేను'ను గుర్తించడమే ఈ ధ్యానం యొక్క అంతర్భావం. మనలో ఒక దైవశక్తి వ్యాపితమై యున్నది. దానిని మనం ధ్యానం ద్వారా గుర్తిస్తున్నాం. మనలోనున్న దివ్యశక్తిని మనం గుర్తించాలి అంటే ముందుగా, మన మనస్సుకి అలజడి తెచ్చిపెట్టే కళంకసహితమైన ప్రపంచాన్ని విస్మరించాలి.

ఆ తరువాత మన దేహాన్ని కష్టపెట్టకుండా, సుఖంగా వుండేటట్టు చూసుకొని కూర్చోవాలి. దానినే సుఖాసనం అంటారు. దానికి ఇలా కూర్చోవాలి అలా కూర్చోవాలి అని లేదు. ఎంత వరకూ నిటారుగా కూర్చోగలిగితే అంతవరకూ కూర్చోవచ్చు. వాతావరణము, మనదేహము, దానిని కదిలించే లోపల ఉన్న మనస్సు యీ మూడూ మనకి సహకరించేటట్లుగా చూసుకోవాలి. మన మనస్సు కదిలితేనే మన దేహం కదులుతుంది. మనస్సుని కదలకుండా అదుపులో పెట్టుకోగలిగితే, దేహం కదలదు. కనుక అన్నింటికంటే ముఖ్యం మనస్సుని విశ్రాంతిగా ఉంచటం. పైకి కనిపించడానికి మనం ఎంత బాగున్నా, బయట వాతావరణం ఎంత ప్రశాంతంగా వున్నా, మన మనసు బాగుండక పోతే, అంతా వికారంగానే వుంటుంది. మనసు వికారంగా ఉంటే, అద్దంలో చూసుకునేసరికి ముఖం కూడా వికారంగానే కనిపిస్తుంది. మన మనస్సు లోపల ఆనందంగా వుంటే ప్రపంచమంతా ఆనందంగానే కనబడుతుంది. మనసులో దుఃఖము, విచారమూ వుంటే ప్రపంచమంతా కూడా దుఃఖపూరితంగానే కనబడుతుంది. అందుకని, మనసుని ప్రశాంతంగా ఉంచుకోవడం కోసమే మనందరమూ ఇక్కడ కూర్చున్నాము. ధ్యానం యొక్క ముఖ్యోద్దేశం మనస్సుని శాంతిగా వుంచుకోవడమే. ముందు మనం శాంతిగా వుండటం అలవరచుకుంటే ప్రపంచమంతా కూడా

శాంతిగానే వుంటుంది.

ఇప్పుడు కొంచెం లోపలికి వెళదాం. మళ్ళీ చెబుతున్నాను. నేను కూర్చున్నట్టే సుఖాసనం వేసుకుని క్రింద కూర్చోవాలని లేదు. మీకు ఎలా సుఖంగా వుంటే అలాగే కూర్చోవచ్చు. మనం శరీరం గురించి ఆలోచించకుండా ఉండడమే ఈ ధ్యానం యొక్క ముఖ్య ఉద్దేశ్యం. మీరెలా కూర్చోగలిగితే అలా కూర్చుని మీ దేహాన్ని నిటారుగా పెట్టుకోవాలి.

– నిటారుగా కూర్చోండి

– మీ రెండు చేతులూ మీ ఒడిలో ఒకటిగా చేర్చిగానీ, లేక చిన్ముద్రని ధరించిగానీ ఉంచుకోండి (శ్రీమాతాజీ – చిన్ముద్రని ఎలా ధరించాలో వారికి చూపించారు). ఇలా చేతులని చేర్చడం వలన మీ శరీరంలో ఒక వలయం తయారు అవుతుంది. మన మనస్సు ధ్యానం చేసేటప్పుడు మీలోని ఆధ్యాత్మ తరంగాలకి అంతరాయం ఏర్పడకుండా వుంటుంది.

– మేము ఉదయం 9గం॥ల వరకూ ఇక్కడే కూర్చుంటాము. అని మీ మనస్సుకి తెలియ చేయండి (చెప్పండి).

– అలాగని ఎప్పుడు టైము అయిపోతుందా అని ఆలోచించవద్దు.

– ఇతర విషయాలేవీ మనసులోనికి రానీయకుండా, బయట ప్రపంచాన్ని మరచి, నేనిక్కడ 9గం॥ల వరకూ కూర్చుంటాను' అని మీ మనస్సుని సమాధాన పరచాలి.

– ఇప్పుడు మీ ఒళ్ళంతా తేలిక చేసుకోండి.

– బరువుగా ఉండవద్దు.

– ఒళ్ళు బిగించవద్దు. చాలా ఫ్రీగా వుండాలి.

– మీ శరీరావయవాలని, కండరాలని బిగించి వుంచితే, మీరు అదే ముద్రని ఎక్కువసేపు దాల్చి వుంచడం కష్టమవుతుంది. కనుక, నిటారుగా కూర్చుని, శరీరాన్ని ఒదులుగా వుంచుకోండి.

– మన ప్రాణానికి ముఖ్యమైనవి ఉచ్ఛ్వాస, నిశ్వాసలు. ఇవి ఆగిపోతే మన జీవితం ఆఖరే.

– ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసలని కుంభించే ప్రక్రియలను కొన్ని యోగాభ్యాసం ద్వారా నేర్చుకోవచ్చు. కానీ, సర్వజ్ఞులు, భగవత్ స్వరూపులు అయిన నా గురుదేవులు నాకు ప్రసాదించిన పద్ధతిని, నేను ఆచరించే పద్ధతినే మీకు చెప్తాను.

– సశేషం

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

29.6.85

ధ్యానమూలం గురోర్మూర్తి ః పూజామూలం గురోః పదం
మన్త్ర మూలం గురోర్వాక్యం ముక్తి మూలం గురోః కృపా॥



శ్రీబాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ "గురువు ఎవరు? భగవంతుడు ఎవరు?" అని ప్రశ్నించారు. ఒక భక్తుడు సమాధానం చెప్తూ 'నాకు గురువు వేరు భగవంతుడు వేరు' అని చెప్పాడు. శ్రీబాబు తిరిగి ప్రశ్నిస్తూ 'ఏమిటయ్యా అలా అంటావు, నీ ఉద్దేశ్యం ఏమిటి?' అని ఇంకొక భక్తుణ్ణి ప్రశ్నించారు. ఆ భక్తుడు సమాధానం చెప్తూ 'గురువు భగవంతుని కన్నా అధికుడని ఆయన ఉద్దేశ్యం' అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ 'అయితే గురువు వేరు. భగవంతుడు వేరు' అన్న మాట. మరి 'గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః అనే శ్లోకం? సగుణంగా నిర్గుణంగా ప్రకాశించే త్రిమూర్తి స్వరూపుడైన గురువే సాక్షాత్తు పరబ్రహ్మా అని అర్థం కదా! మరి గురువుకి, భగవానునికి తేడా ఉందంటారా?" అని ప్రశ్నించారు. శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "గురు కృప లేక అనుగ్రహం మోక్షాన్ని ప్రసాదించగలుగుతుంది. గురుకృపని పొందగలగాలంటే ఆహంకార, మమకారాలు తొలగాలి. కన్ను మమకారానికి, చెవి ఆహంకారానికి సంకేతాలు. చూపు ద్వారా వ్యామోహము కలుగుతుంది. చెవి ద్వారా విన్న శబ్దంతో ఆహంకారము పెరుగుతుంది నేను, నాది అనబడే ఆహంకార, మమకారాలను వదిలేస్తే కాని, భక్తి విశ్వాసాలు నిలబడవు. భక్తి విశ్వాసాలు లేని వాడికి ఒక ఆలయంలోని శిలావిగ్రహం నల్లటి శిలగానే కనబడుతుంది. భక్తి విశ్వాసాలు ఉన్నవాడు ఆ శిలావిగ్రహంలోనే నీలమేఘశ్యాముణ్ణి దర్శిస్తాడు. భక్తి విశ్వాసాలు పెంపొందాలంటే గురుధ్యానం ఒక్కటే శరణ్యం.

గురుమూర్తి యొక్క స్వరూపమునే ధ్యానించాలి. గురుదేవుని బోధనే ధ్యానంలో మననం చేయాలి. ధ్యానం చేయటానికి సుఖాసనంలో కూర్చోవాలి. నిటారుగా కూర్చోవాలి. వంగకూడదు నడుం వంచి కూర్చున్నట్లయితే ఒక్కొక్కసారి

ప్రమాదం జరగవచ్చు. ధ్యానానికి నిర్భయుడవై కూర్చోవాలి. సాధకుడు ప్రారంభంలో తనకు ఎదురుగా ఒక మూర్తిని ఉంచుకొని ధ్యానించాలి. మనస్సుని ఆమూర్తి యందే నిలిపి ధ్యానించాలి. అలాధ్యానం చేయగా చేయగా ఆ మూర్తి తన మనస్సునందే నిలిచిపోతాడు. మనస్సుకు మించిన శత్రువు, ఇంద్రియానికి మించిన ద్రోహి లేడు. నీకు ధ్యానం కుదరాలి అంటే మనస్సు ఆవరణ అడ్డుపడుతుంది.

'జ్ఞానాగ్ని దగ్ధకర్మాణి' అని గీతాచార్యుడు బోధించాడు 'ధ్యానాగ్ని దగ్ధ కర్మాణి' అని మీ హృదయ బాబు హెచ్చరిస్తున్నాడు. ధ్యానం ద్వారా ఉద్భవించిన అగ్ని మనస్సు అనే అవిద్యారణ్యాన్ని దగ్ధం చేసి శుద్ధి చేస్తుంది. ధ్యానాగ్ని ద్వారా శుద్ధమైన మనస్సు తిరిగి అశుద్ధమవదు. ధ్యానానికి కూర్చొని మూలాధారము మీద కుంభించి పైకి భ్రూమధ్య భాగము వరకు ఓంకార నాదాన్ని నడపాలి. షట్చక్రాలు దాటి మనస్సు సహస్రారాన్ని చేరుతుంది. అలా షట్చక్రాలు దాటినట్లు మనకి గుర్తు ఏమిటి? అని మీరు ప్రశ్నించవచ్చు. కామ క్రోధాది గుణాలను జయించటమే షట్చక్రాలను దాటినట్లు గుర్తు. ఆరు చక్రాలు దాటిన మనస్సు శుద్ధి చెందుతుంది. తిరిగి ఆమనస్సు మలినాలను కోరదు. కాబట్టి ధ్యానంలో మనస్సు నిలబడే వరకు జాగ్రత్తగా ఉండాలి. అక్షరాలు నేర్చుకొనేవాడు సరిగా దిద్దాలి కదా! అక్షర స్వరూపుడైన తరువాత కళ్ళుమూసుకుని వ్రాసినా పరవాలేదు" అన్నారు శ్రీబాబు.

*



# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

జులై 2013

2 మంగ శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

6 శని మాసశివరాత్రి , శనిత్రయోదశి

16 మంగ కర్కాటక సంక్రమణం దక్షిణాయనం ప్రారంభం

19 శుక్ర తొలి ఏకాదశి, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

22 సోమ ఆషాఢ పూర్ణిమ, సత్సంగం, సద్గురుపాదపూజ, భక్తసమారాధన, చాతుర్మాస్య దీక్ష ప్రారంభం.

ఆగస్ట్ 2013

1 గురు శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

5 సోమ మాస శివరాత్రి

16 శుక్ర శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీవ్రతం

21 బుధ రాఖీపూర్ణిమ శ్రీసద్గురు పాదపూజ

28 బుధ శ్రీకృష్ణాష్టమి స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా 27-8-13 నుండి 2-9-13 వరకు సప్తాహదీక్షతో శ్రీకృష్ణాష్టమి వేడుకలు జరుగుతాయి.

ఆగస్ట్ 30 శుక్ర శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

**శ్రీసద్గురు ప్రసాదిత (50వ,) స్వర్ణోత్సవ శ్రీరాధాకృష్ణ జన్మాష్టమి మహోత్సవములు**
**శ్రీ సద్గురు భాగవత, అఖండనామ సప్తాహ, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళన**
**సర్ణోత్సవ కార్యక్రమాలు**

**స్వస్తి శ్రీ చాంద్రమాన శ్రీ విజయనామ సంవత్సర శ్రావణ బహుళ సప్తమి అనగా ది.27-8-2013 మంగళవారం నుండి 2-9-2013 సోమవారం వరకు సప్తాహ దీక్షతో శ్రీకాళీవనాశ్రమము నందు పూజా కార్యక్రమములు జరుపబడును. కావునయావన్మంది భక్తులు కార్యక్రమములో పాల్గొని తరించవలసినదిగా కోరుతున్నాము.**

కార్యక్రమములు

సప్తాహ్నిక శ్రీకృష్ణ మూలమంత్ర హోమము, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము, అఖండ సప్తాహ్నిక హరేరామ నామము, భాగవత ప్రవచనము, భగవద్గీతా పారాయణ మాతాజీవారిచే దివ్య అనుగ్రహ భాషణ ఉంటాయి.

2-9-2013న పూర్ణాహుతి, శ్రీరాధాకృష్ణుల సహస్రనామపూజ, శ్రీసద్గురుపాదపూజ జరుగుతాయి.

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

"ఓరామా! నా కథనే విను. నేను బ్రహ్మమానస పుత్రుడను. తన సంకల్పంతో నన్ను తన ప్రతిరూపంగా సృజించి, ఆత్మజ్ఞానమును ప్రసాదించాడు. అప్పుడు బ్రహ్మ దేవుడు నన్నిలా ఆజ్ఞాపించాడు 'నీవు జంబూద్వీపంలోని భరతవర్షమునకు వెళ్ళి, అక్కడ మానవాళికి బ్రహ్మజ్ఞాన రహస్యమునుపదేశించి, ఆత్మజ్ఞాన ప్రాప్తికి ఉపకరించే నాలుగు మార్గములను వారికి ప్రబోధించు.'



"మోక్షమనేది, ఆత్మజ్ఞానమనే దివ్య వృక్షము యొక్క దివ్య ఫలము. ఆత్మవిచారణ వాసనలను, సంకల్పాలను, మనసును నిర్మూలనం చేస్తుంది. విచారణ నిత్యమైన శాంతిని ప్రసాదిస్తుంది. ఉదాత్తమైన మనసు గల ఓరామా! 'నేనెవరిని? ఎక్కడ నుంచి వచ్చాను? ఈ అనూహ్యమైన మాయ ఎక్కడి నుంచి వచ్చిందనే విచారణ అజ్ఞానమును నిర్మూలించి, ఆత్మజ్ఞానము ద్వారా ముక్తిని ప్రసాదిస్తుంది.

<u>సంతోషం</u> (సంతృప్తి) -

సంతృప్తిని మించిన సంపద లేదు. సంతృప్తి అనేది ఉత్తమోత్తమమైన సుగుణము. ఎవడైతే సంతృప్తిగా ఉంటాడో అతనికి చికాకు లేదు. హాయిగా విశ్రాంతి తీసుకోగలడు. అతడు యీ ప్రపంచాన్ని గడ్డిపరక కంటె హీనంగా గ్రహిస్తాడు. విషయ ఆనందమతనికి విషము వంటిది. అతని మనస్సు పూర్తిగా ఆత్మవిచారణ యందు, ఆధ్యాత్మిక విషయములయందు లగ్నమై ఉంటుంది. అతనికి ఆనందము అంతర్గతము. విపరీత పరిస్థితులు అతన్ని కించిత్ కూడా కలతపెట్టవు.

అన్ని దుష్టగుణాలను సంతృప్తి అంతము చేయగలదు. అత్యాశ, లోభము మొదలగు భయంకర వ్యాధులకు సంతృప్తి పరమౌషధము. సర్వరోగ నివారణి. సంతృప్తితో చల్లబడిన మనస్సు శాంతంగా, ఆందోళన రహితంగా ఉంటుంది. సంతృప్తిగల మానవుడకు మించిన సంపన్నుడు యీ జగత్తులో ఎక్కడా లేడు. అతడు నిరుపేదయైనా యావత్ప్రపంచమునకూ సార్వభౌమునిలాంటివాడు. అట్టివాడు తనకు లభించనిదాని కోసం తపన చెందడు. ఉన్నదానితోనే సంతుష్టుడౌతాడు. అప్రయత్నంగా లభించిన దానితోనే తృప్తిచెందుతాడు.

అతడు మహోత్తమమైన, ప్రశంసనీయమైన వ్యక్తిత్వము కలవాడు. అణిమాది సిద్ధులన్నీ అతనికి సేవకులలాగా వేచి ఉంటాయి. అతనికెట్టి చీకు, చింత. ఆందోళన

ఉండవు. సంతృప్త మానవునికి ఉన్న ప్రశాంత వదనము అతనితో సంబంధం ఉన్న వారందరికీ కూడా ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అట్టివాడు మహాత్ములచేత, మునీశ్వరుల చేత కొనియాడబడతాడు.

సత్సంగము –

సంసారమనే సాగరము దాటటానికి, సత్సంగము చక్కని నావవంటిది. ఒక్క తృటికాలమైన మహర్షుల సాంగత్యము లభిస్తే, ఎంతో లాభదాయకంగా ఉంటుంది. సత్పురుషులు తమ దర్శనమాత్రాన పాపాలను నశింపచేసి, మనస్సును ఉదాత్త స్థితికి చేర్చగలరు. సత్పురుషుల సాంగత్యం మానవునిలో వివేచనా శక్తిని పెంపొందిస్తుంది. అజ్ఞానమనే వృక్షమును మొదలంటా నరికి, అన్ని ప్రమాదాల నుండి కాపాడుతుంది.

మహర్షులు సత్ప్రవర్తనా నియమావళిని సాధకులకు రూపొందించి, వారికి ఋజువైన జీవన విధానాన్ని ప్రబోధిస్తారు. సత్పురుషుల సాంగత్యము మనలను సన్మార్గంలో నడిపించి, అజ్ఞానాంధకారమును పారద్రోలుతుంది. మాయను మనస్సును జయించటానికి సత్సాంగత్యము అద్భుతమైన సాధనము. కనుక ఆత్మసాక్షాత్కారం పొందటానికి సంతృప్తి, సత్సంగము, ఆత్మవిచారణ, శాంతి చతుర్విధ సాధనలు. ఎవరైతే ఈ నాలిగింటితో మైత్రిని పెంపొందించుకుంటారో, వారు సంసార సాగరాన్ని సునాయాసంగా దాటగలరు.

ఈ నాలిగింటిలో ఏ ఒక్క గుణాన్ని అలవరచుకున్నా, మిగతా మూడు గుణాలు పెంపుడు కుక్కల్లా తోకాడించుకుంటూ మన వెంట వస్తాయి. ఈ నాలుగు సద్గుణములు మనలోని దుష్టగుణాలను పారద్రోలి, మనస్సును అదుపులో పెడతాయి. మనసనే తప్పుల తడికలో, కోరికలనే ప్రవాహము పరవళ్ళు తొక్కుతూ, మంచి, చెడు అనే తీరాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తుంది.

కనుక ఓ రామా! యీ నాలుగు సాధనాలతో మనస్సును ధైర్యంగా నిగ్రహించి నీ జీవితాన్ని చక్కగా మలచుకో. ఆత్మవిచారణ క్రమబద్ధంగా చేసినవాడు, సంసారంలోని సుఖదుఃఖాలకు విలక్షణంగా ఉంటాడు. అతడు శాంతి సంతోషాలలో ఓలలాడుతూ ఉంటాడు. మాయ అతని సమీపమునకు రాదు.

సద్గ్రంథ పఠనము, సద్విచారణ, సత్సాంగత్యము, సంతృప్తి, శాంతి మున్నగు సాధనలతో సత్ప్రవర్తన, యింద్రియ నిగ్రహము పెంపొందించుకుని ఆత్మజ్ఞానాన్ని సాధిస్తాడు.

– సశేషం

# గురుకృపా హి కేవలమ్

గత సంచిక తరువాయి - సుశీల ప్రసాద

ఒకసారి శ్రీబాబుతో శ్రీశైలం, మహానంది క్షేత్రాలు దర్శించినప్పుడు అక్కడ చుట్టుప్రక్కల ఉన్న విష్ణునంది వంటి సుక్షేత్రాలకు కూడా శ్రీబాబు మమ్మల్ని తీసుకు వెళ్ళారు. దగ్గరైతే కాలినడకనే వెళ్ళేవాళ్ళం. స్వామి కారులో వెడుతుంటే, మేము సరదాగా కారు వెనుకనే పరుగులు తీసేవాళ్ళం. శ్రీబాబు కారులోనుంచి చాక్లెట్లు, బిస్కెట్లు విసురుతూ ఉండేవారు. అవి ఏరుకుంటూ మళ్ళా ముందుకి సాగుతూ ఉండేవాళ్ళం.

అలాంటి సమయంలో అడవుల వెంట ప్రకృతి సౌందర్యాన్ని తిలకిస్తూ, వినోదిస్తూ వెడుతుంటే, హనుమాయమ్మగారు మా సైజు వాళ్ళందరినీ కూడగట్టి, "మనం యీ ప్రక్క త్రోవ లోనుంచి ముందుగా వెళ్ళి శ్రీబాబును చేరుకుందాము" అని ప్రోత్సహించే సరికి, అంతా 'సరే!' అన్నాము. శ్రీబాబు నామస్మరణతో భజనలు చేసుకుంటూ ముందుకు సాగుతుంటే, కొంత దూరం వెళ్ళేసరికి దోవ కనబడలేదు. దారంతా తీగలు, ముళ్ళు, తుప్పలు! అడుగు ముందుకు పడటానికి వీలు లేకుండా ఉంది. సూర్యాస్తమయం కావొస్తోంది. మాకు ఎంతో భయం వేసింది. 'బాబూ! బాబూ!' అంటూ ముక్తకంఠంతో ఎలుగెత్తి ప్రార్థిస్తూ చుట్టూ చూశాము. ప్రార్థన వృథా కాదు కదా! నమ్మినవారిని విడువనని ప్రతిజ్ఞచేసిన సద్గురునాథులు! కంటికి ఎదురుగా ఒక సన్నని కాలిబాటను చూపించారు. శ్రీబాబు దయతో దాన్ని పట్టుకుని చకచకా నడుచుకుంటూ శ్రీబాబును తదితరులను చేరుకున్నాము.

శ్రీబాబు గంభీరంగా మా వంక చూస్తూ "ఏ త్రోవలో వెళ్ళారు?" అని ప్రశ్నించారు. అంతా తలలు వంచి నిల్చున్నాము. "మీ కోసం ఎంత ఖంగారు పడుతున్నాము యిక్కడ! భగవంతుడు కరుణామయుడు కనుక చల్లగా చూసినందున యివాళ మీకు పెద్ద ప్రమాదం తప్పింది. అడవి దారిలో మరులుతీగలని ఉంటాయి. మీ కేం తెలుసు, మీ మొహం! అవి గనుక కాళ్ళకి చుట్టుకుంటే సూర్యోదయమయ్యే దాకా అక్కడే చుట్టూ చుట్టూ తిరుగుతూ రాత్రంతా ఉండిపోవలసి వచ్చేది! మీరు ప్రక్క దోవను పట్టినప్పుడు సరైన దారి చూపించక తప్పలేదు పరమాత్మకి. వాని భక్త వాత్సల్యం అట్టిది మరి" అన్నారు. శ్రీగురుదేవులు, భగవత్స్వరూపులైన సమర్థ సద్గురుని అవ్యాజ ప్రేమని ఎంతని కొనియాడగలము!

ఇందులోని అంతార్థం ఇది. ప్రపంచ ఆకర్షణలు విషయాలు అనే మరుల తీగెలకి చిక్కి అజ్ఞానమనే చీకటిలో అల్లాడుతున్న జీవులకి జ్ఞాన సూర్యుని కాంతిలో విజ్ఞానబాటను చూపి గమ్యస్థానం చేర్చగలవాడు కరుణామృత హృదయుడు నమ్మిన వారి సొమ్ము అయిన సమర్థుడు శ్రీగురుదేవుడు!!

# తగిన వారసులెవరు?

– సుశీలా ప్రసాద

తన యింటి బాధ్యతలను ఒప్పగించినట్లయితే, తన మాటను మన్నిస్తూ, శ్రద్ధగా విధులన్నీ నెరవేరుస్తూ, తన పేరును నిలబెట్టగల తెలివి తేటలు ఎవరికున్నాయో అని పరీక్షించదలచుకున్నాడు శ్రీగురునాధంగారు. కొడుకులు భార్యావిధేయులు. కనక ఎలాగూ వారి మాటలను జవదాటరని తెలిసిన గురునాధంగారు తన ముగ్గురు కోడళ్ళనూ పిలిచారు. తలొక గుప్పెడు వడ్లగింజలను వారి చేతుల్లో పోశారు. "ఇవి మళ్ళీ నేనడిగినప్పుడు నాకివ్వాలి తెలిసిందా?" అని గట్టిగా చెప్పారు వాళ్ళతో.

ఆయనటు వెళ్ళగానే ముగ్గురిలో పెద్దకోడలు "ఆయన అడిగేదాకా యివే దాచి యివ్వాలని ఏమిటి? గాదెలో కావలసినన్ని వడ్లు ఉన్నాయి. అవి తీసియిస్తే సరిపోదా!" అనుకుంటూ చేతిలోని వడ్లను పెరట్లోకి విసిరివేసింది. రెండో కోడలు ఏమి చేయాలో తోచక అవి అప్పుడే ఒలిచి నోట్లో వేసేసుకుంది. "మామగారు తిరిగి అడిగినప్పుడు కదా, అప్పడి సంగతి అప్పుడు చూడవచ్చులే!" అనుకుంది. ఇక మూడోకోడలు ఆ గుప్పెడు వడ్లని అప్పుడే తనను చూడవచ్చిన అన్నగార్లకిచ్చి ఏం చేయ్యాలో చెప్పింది. ఇలాగ కొంతకాలం గడిచింది. ఆ విషయం మరుగున పడిపోయింది.

కొంతకాలం తరువాత ఒకనాడు గురునాధంగారు తన ముగ్గురు కోడళ్ళనీ పిలిచారు. తను వారికిచ్చిన వడ్లను గురించి నిలదీసి గట్టిగా అడిగారు. ఇద్దరు కోడళ్ళూ తాముచేసిన పనిని దాచుకోకుండా చెప్పారు. తలవంచుకుని ఉన్న మూడో కోడలు "ఈ సాయంత్రం దాకా గడువివ్వండి మామగారూ! అప్పుడు చెబుతాను" అన్నది వినయంగా. పెద్దవాళ్ళిద్దరూ తప్పుచేసి మనలాగే కప్పిపుచ్చుకోవటానికి ఏదో నాటకం ఆడుతోందనుకున్నారు. గురునాధంగారు మాత్రం మౌనంగా ఉండిపోయారు.

సాయంత్రంవేళ యింటి ముందు ఎడ్లబళ్ళు వచ్చి ఆగాయి. బళ్ళనిండా ధాన్యం బస్తాలున్నాయి. బళ్ళు తోలుకువచ్చిన మనుష్యులు వాటిని ముంగిట్లో దింపారు. "ఏమిటివి?" అని గురునాధంగారు అడిగేసరికి, మూడో కోడలు ముందుకు వచ్చి యిలాగ సమాధానం చెప్పింది. "మామగారూ! మీరిచ్చిన వడ్లని మా అన్నగార్లకిచ్చి మా పుట్టింటికి పంపాను. అక్కడ భూమి దున్ని విత్తనాలు జల్లమన్నాను. మా అన్నగార్లు జాగ్రత్తగా విత్తినప్పుడు వచ్చిన నారుకి నీరుపెట్టి, కలుపుమొక్కలు ఏరేసి, పైరు ఎదిగినదాకా శ్రద్ధగా చూసి పంట పండించినప్పుడు వచ్చిన ధాన్యాన్ని మళ్ళీ మళ్ళీ పండించారు. అవి యీనాటికి యిన్ని బస్తాలు అయ్యాయి. నేనీనాడు కబురు పంపగానే వాటన్నిటిని బళ్ళకెత్తి పంపారు. మీరిచ్చిన గుప్పెడు వడ్లు శ్రమపడితే ఇంత ఫలితమిచ్చాయి" అని.

గురునాధంగారు పరమానందంగా మూడో కోడలు చేతిలో ఇనప్పెట్టె తాళాలు, ఇంటి తాళాలు ఉంచుతూ "నా బాధ్యతను స్వీకరించటానికి నా ఆస్తికి తగిన వారసురాలివి నువ్వేనమ్మా" అంటూ ఆమె శిరస్సుమీద చేతినుంచి మనసారా ఆశీర్వదించారు.

ఇది కథ అనుకుంటే పొరబాటే. ఇందులో ఎంతో పరమార్ధముంది. అది ఏమిటంటే....

గురునాధంగారు అంటే శ్రీసమర్ధ సద్గురునాధులు. ఆత్మజ్ఞాన సంపన్నులైన అద్వైత సామ్రాజ్య చక్రవర్తి. వారు తన దగ్గరున్న ముగ్గురు శిష్యులను పిలిచారు. వారి ఇంద్రియాలనే భార్యలకి వారి మనస్సులే భర్తలు. మనస్సు ఇంద్రియ వశమైతే క్రమమార్గాన నడవదు. ఇంద్రియ వశమై ఉన్న మనస్సును ఉద్ధరించగలగాలి. అందుకే తమ అపారమైన ఆధ్యాత్మిక సంపదను అనుభవించగలందుకు తగిన అర్హత కలిగించడానికి ఆ ముగ్గురికీ లక్ష్యార్థాన్ని దయతో ప్రసాదించారు. సాధన చేసి చూపమన్నారు.

మొదటి శిష్యుడు లక్ష్యార్థాన్ని అనుగ్రహించినప్పుడు "ఓహో! ఇది నేను రోజూ వింటున్నదేరా! గురుమూర్తి చెప్పిన దానిలో కొత్తదేముంది?" అడిగినప్పుడు గుర్తు చేసుకుని చెప్పవచ్చులే" అని నిర్లక్ష్యంగా వదిలేశాడు. రెండో శిష్యుడు లక్ష్యార్థాన్ని మనస్సుకి పట్టించుకోక కేవలం నోటితో స్మరణ చేస్తూ ధ్యాసనిలపక సాధనలో ఎక్కడున్నావే గొంగళీ అంటే ఇక్కడే ఉన్నానే కంబళీ అన్న స్థితిలో ఉండిపోయాడు.

మూడో శిష్యుడు శ్రద్ధా విశ్వాసముల సాయంతో ప్రపంచవాసనలనే చెత్తను తొలగించి హృదయ క్షేత్రాన్ని శుద్ధిచేసుకుని స్మరణ మననములనే ఎడ్లతో దుక్కి దున్ని అందులో లక్ష్యార్థమనే బీజాన్ని నాటుకున్నాడు. భక్తి అనే నీరుపోసినందున పెరుగుతున్న జ్ఞానమనే పైరు మధ్యలో సంకల్ప వికల్పాలు కోరికలు అనే కలుపు మొక్కలూ ఏరివేస్తూ వచ్చాడు. అప్పుడు వైరాగ్యమనే వెన్నులు వేసి పంట సిద్ధమైనప్పుడు మరీమరీ సాధన చేస్తూ వృద్ధి పొందించి సాధన చతుష్టయమనే ఆ ధాన్యరాసిని నిర్మలాంతఃకరణమనే పాత్రలో నింపి శ్రీగురు సుప్రసాద మహావాక్యానుభవమనే ఫలసాయాన్ని శ్రీసమర్థ సద్గురునాధుని దివ్యచరణ సన్నిదిలో సమర్పించాడు.

ఆ సచ్ఛిష్యుని అఖండ అద్వైత సామ్రాజ్య చక్రవర్తి అయిన శ్రీగురుదేవులు తమ అపారజ్ఞానానుభవ సంపదకు తగిన వారసునిగా పరమానుగ్రహంతో మహదాశీర్వచన మందించారు.

*

# పరిప్రశ్నేన సేవయా - పరాశర ప్రసాద్

"బాబుగారూ! నేను ఏ స్థితిలో ఉన్నాను? నేను జ్ఞానం ఎప్పుడు పొందుతాను? నేను సాధన ఎంతవరకు కొనసాగించాలి? పోనీ, మీ మంత్రదండంతో మా మనస్సును కట్టి వేయవచ్చుకదా?' అనే ప్రశ్నలతో నన్ను వేధించి, నా కాలాన్ని అంతా దుర్వినియోగ పరచేవారే తప్ప 'నాకు సమాధిస్థితిని ప్రసాదించండి' అని అడిగినవారు ఎవరైనా ఉన్నారా?



సాధన పరిపక్వస్థితికి చేరిన సాధకుడు ఎలా ఉంటాడు? నిరహంకారియై, నిరాడంబరియై, త్యాగము, వినయవిధేయతలు కలిగినవాడై ఉంటాడు. అతనికి ఆశగాని, అసంతృప్తిగాని ఉండదు. ఇందులో ఏ ఒక్క లక్షణం కలిగి ఉన్నా, 'నేను సాధన ఎంతకాలం కొనసాగించాలి?' అన్న ప్రశ్న వేయడే!

అంతేకాదు, సంకల్పము, సంశయము ఉన్న మనస్సు జ్ఞాన తేజస్సును గుర్తించనీయదు సుమా! జ్ఞానాన్ని మరుగు పరుస్తుంది. మరుపును తీసుకు వస్తుంది. మీరు గాఢ సుషుప్తిలో కొంతవరకు ఆనందాన్ని చవిచూస్తున్నారు. దానికి కారణం మనస్సు అణిగి ఉండటమేగా. మరి మెలకువ రాగానే మనస్సు గుణాల ప్రేరణకి గురికాక తప్పదు కదా. కన్ను తెరచి ఉంటే జగత్తుని చూడగలుగుతున్నాము. కన్ను మూసి నిదురించావో అప్పుడు జగత్తు ఉందా? చూస్తున్నావా? పోనీ, నీ బంధుత్వాలు, బంధాలు ఉన్నాయా? ఈ ఉపాధి ఉన్నంతవరకే కదా యీ బంధుత్వాలు, బంధాలు. ఈ ఉపాధి అదృశ్యమైతే నీ స్థితి ఏమిటి? ఈ బంధుత్వాలు ఏమవుతాయి? ఆలోచించండి.

ఈ ఉపాధి ఉన్నప్పుడే మేల్కొని, ఈ ఉపాధిని, ఇంద్రియాలను మనస్సు దాటి అంతరంగంలోకి వెళ్ళి, విచారణ చేయండి. వీటన్నిటిని ప్రకాశింపచేసేది ఏది? అని విచారణ చేయగా చేయగా 'నేను' మాత్రం మిగులుతుంది. అదే గురుకాంతి. ఆ స్థితికి ఎదిగిన సాధకునికి సందేహాలు ఉండవు. భగవన్నామము ఉచ్చరించినంత మాత్రాన నీ కనులు నుండి ఆనంద బాష్పాలు జాలువారుతున్నాయా? అలా అయితే నువ్వు పండిపోయినట్టే. అంతకన్న మించిన స్థితి ఏముంది? పోనీ భగవత్సంబంధమైన కార్యమేదైనా, ఎక్కడైనా జరుగుతోందని తెలిసినప్పుడు నీ వ్యక్తిగతమైన ప్రాపంచిక కార్యక్రమాన్ని త్యాగం చేయగలుగుతావా? అదే నిత్యానిత్య వస్తు వివేకము అంటే. దాన్ని సాధించగలిగితే ధన్యుడవే. సద్గురుమూర్తి ఆదేశము శిరోధార్యముకదా. నీపై క్రోధము ప్రదర్శించి, వేరొక భక్తుని భుజంపై చేయవేసి నవ్వుతూ సంభాషణచేస్తుంటే నీ మనస్సు యొక్క స్పందన ఎలా ఉంటుంది? ఏ స్పందన లేకుండా ఉండగలిగితే యింక జపతపములేల?

*

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

28. శ్లో॥ అస్తోక స్మిత భర మాయతాక్షం
విశ్లేషస్తనమృదితం వ్రజాఙ్గనాభిః
నిస్సీమస్తబకిత నీలకాన్తి ధారం
దృశాయసం త్రిభువన సున్దరం మహోస్తే ॥

తాత్పర్యము -



కృష్ణా! పొంగుచున్న చిరునవ్వు గలది, మిగుల వెడద కన్నులు గలది, వ్రజకాంతల కఠిన స్తనములచే మెదప బడినది, మేరలేక పోగుచేయబడిన నల్లని కాంతులుగలది, త్రిలోకములందు అందమైనది అయిన నీ యొక్క తేజమును చూడగోరెదను.

"సుబ్బన్నా! నిన్న మధ్యాహ్నం మన గోవులు మందాకిని, గౌతమి రెండూ మేత మేస్తూ చాల దూరం వెళ్ళిపోతే నువ్వు, సూరన్న వాటిని వెదికి పట్టుకొచ్చారు గదా! పొద్దుగూకి పోతున్నది యిళ్ళకు పోవాలనే తొందరలో ఏం జరిగిందో మిమ్మల్ని అడగనేలేదు. మీరు రావటం ఆలస్యమైంది కదా! అక్కడేం జరిగింది?"

కన్నయ్య యిలా అడగగానే వాళ్ళిద్దరూ ముందుకొచ్చారు. ఉత్సాహంగా చెప్పటం మొదలు పెట్టారు. "కిట్టయ్యా! ఏం చెప్పమంటావు! అల్లంత దూరాన అక్కడో అందాల తోట కనిపించిందయ్యా! ఆ తోటలో చెట్లన్నీ విరగకాసి ఉన్నాయి. పూలన్నీ పూసి దూరానికి కూడా కమ్మని వాసనలు గుప్పుమంటున్నాయి. ఆ పళ్ళు చూసి మా నోరు ఊరిపోయిందనుకో. నీతో చెప్పకుండా, నిన్నడగకుండా తోటలోకి వెళ్ళాలంటే మనసొప్పలేదయ్యా! అది చూస్తుంటేనే ఆలస్యమైంది."

వాళ్ళ మాటలు వింటుంటేనే నల్లనయ్య విశాలమైన కళ్ళు మెరిసాయి. "చూడండి రా! ఇవాళ నేను గోవులను చూసుకుంటూ ఉంటాను. ఇప్పుడు మీరందరూ వెళ్ళి హాయిగా ఆ తోటలోని పళ్ళన్నీ తిని, ఆడుకొని రండి. సరేనా!" అంటున్న గోపాలుని మాటలు వింటూ 'అలాగ చెప్పు' ఆనందంగా ఎగురుతూ కేకవేసుకుంటూ సుబ్బన్న సూరన్న దారి చూపిస్తుంటే గోపబాలురంతా బయలుదేరి పోయారు. కృష్ణుడు వాళ్ళని చూస్తూ చిరునవ్వు పొంగుతుంటే "అమాయకులు! నేను ఎంత చెప్తే అంత" అని ప్రేమగా అనుకున్నాడు.

కొంత సమయం గడిచింది. కన్నయ్య పున్నాగ చెట్టు నీడలో కూర్చుని మురళి

తీసి పాతరాగాన్నొకటి క్రొత్తగా మార్చేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. చేరువనే చెట్లక్రింద ఆవులన్నీ మాగన్నుపెట్టి పడుకుని ఉన్నాయి. అంతలో పిల్లలంతా పరుగులెడుతూ ఆయాస పడుతూ వచ్చిపడ్డారు. వాళ్ళవంక ప్రశ్నార్థకంగా ఏం జరిగిందన్నట్లు చూశాడు కన్నయ్య.

"అన్నా! నువ్వు లేకుండా పని జరగదనుకో. అందరం వెళ్ళామా, ఏ అడ్డూ లేదని తోటలో దూరామా, పళ్ళు కోసుకుని తింటూ, చెట్లు కొమ్మలెక్కి దూకుతూ, గంతు లేస్తూ ఉన్నామా, అప్పుడే మునిగిపోయినట్లు ఆయనెవడో ఉరిమి ఉరిమి పిడుగుపడ్డట్లు అరుచుకుంటూ వచ్చి మా మీద పడ్డాడు. అంతదాకా ఆయన అసలు అక్కడున్నట్లు అసలు మాకు తెలియనే తెలియదు. దుడ్డుకఱ్ఱ తీసుకుని మమ్మల్ని తరిమితరిమి కొట్టాడు. వెనక్కి తిరిగి చూడాలంటే భయమేసి కాలికి బుద్ధి చెప్పి, అదే పరుగున నీదగ్గరకి వచ్చి పడ్డాము. అంత మంచి తోటలో, అంత చెడ్డవాడు ఉండటం ఏం బాగోలేదు కన్నయ్య"

చిన్నబుచ్చుకున్న వాళ్ళ మొహాలు చూస్తూ, ఓదారుస్తూ, "పోనీలే రెండు రోజులాగితే తనే పిలిచి పెడతాడు చూడండి" అనగానే, అందరూ ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవిచేసి, ఆశ్చర్యంగా కృష్ణునివంక చూస్తూ "నిజంగా అలా జరుగుతుందా? ఆ మనిషిని చూస్తే, కోపంతో తిట్టినతిట్లు వింటే, నువ్వు నమ్మవు తోటలో అడుగుపెడితే కాళ్ళు విరగ్గొడతాను అన్నవాడు రమ్మని ప్రేమగా పిలిచి పెడతాడటంవా? ఎలాగ నమ్మేదయ్యా?" అన్నారు వాళ్ళు.

"నేనెప్పుడైనా అబద్ధం చెప్పానా?" అనగానే 'లేదు లేదు కన్నయ్యా!' అని వాళ్ళంతా ఒకే మాటగా చెప్పారు. వారి విశ్వాసమే నల్లనయ్య పెదవులపై నిలిచిన వేణుగానమై, నూతన రాగమై మ్రోగసాగింది.

కలత నిండిన మనస్సు బరువెక్కి తెల్లవార్లూ నిద్రలేక మూతలు పడుతున్న కళ్ళను ఎలాగో తెరుస్తూ, తూర్పు తెల్లవారుతుంటే అలవాటుగా తోటలోకి నడిచి వెళ్ళాడు శరభయ్య. పూర్తిగా కళ్ళు తెరిచి చూసినా, ఏముందక్కడ ఆనందించటానికి? కళ్ళనిండా నీరు నిండి, మసకబారిన దృష్టితో ముందుకు చూస్తే, ....అల్లంత దూరాన.... అప్పుడే ఉదయించే సూర్యకిరణాల వెలుగులో పచ్చగా మెరుస్తూ కనబడిందొక చెట్టు. శరభయ్య విభ్రాంతుడయ్యాడు. త్వరత్వరగా అడుగులేశాడు. దారంతా, మాడిపోయిన, ఎండిపోయిన కొమ్మలు, రెమ్మలు, ఆకులు ముళ్ళు, కాళ్ళల్లో గుచ్చుకుంటుంటే ఆ తియ్యటి మామిడి చెట్టు దగ్గరకు వెళ్ళాడు. అది యధాపూర్వంగానే ఆకులు, కొమ్మలు, కాయలు, పళ్ళతో పచ్చగా నిండి ఉంది. అది తన భ్రమా? లేక కలా? అంతేకాదు అతనికింకా వింత గొలిపింది, ఆ చెట్టు మీద ఒక చిన్నారి బాలుడు కూర్చుని "తాతా! నన్ను దింపవూ?" అని పిలుస్తున్నాడు. స్పష్టంగా తను స్పృహలో ఉండగానే మాటలు వినిపిస్తున్నాయి.

– సశేషం

# ధ్యానం ఎందుకు చేయాలి?

- రమణ ప్రసాద్

(మౌన ధ్యాన శిబిరంలో చేసిన శ్రీమాతాజీవారి ప్రసంగాల నుండి)

సద్గురుదేవులు తమ బోధామృతంలో ధ్యానం ప్రశాంతతను చేకూరుస్తుంది అని చెప్పారు. ధ్యానం కుదరకపోతే విసుగు చెందకూడదు. గురుదేవుడు కనుమరుగై, కనిపించక పోయినా మన ఉనికికి వారే కారణం. ఈ ప్రపంచంలో మన మనుగడకు ఒక స్పేస్ యిచ్చారు. మనం వేరే ఊరికి వెళ్ళి తిరిగి మన యింటికి చేరుకుంటే ఎంత తృప్తిగా ఉంటుంది? అలాగే మన యింటికి మనం చేరుకోవటమే ధ్యానం.

కంటి ద్వారా చూసేవి, చెవి ద్వారా వినేవి మనస్సును విచలితం చేస్తాయి. వాక్కు ద్వారా దోషం వస్తుంది. మనం సద్గురు సన్నిధిలో ఉన్నాము. సద్గురుదేవులు కంటి ద్వారా మంచి విషయాలనే చూసేటట్లు, చెవి ద్వారా మంచి విషయాలనే వినేటట్లు మన యింద్రియాలు మంచి కార్యాలనే చేసేటట్లు వారి బోధామృతం ద్వారా మనకు తెలియజేస్తున్నారు.

ధ్యానం ఎందుకు చేస్తున్నామో తెలుసుకోవాలి. ధ్యానమంటే ఒక అవగాహన రావాలి. ధ్యానం ఎందుకు చేయాలని ప్రశ్నించేవారికి, నువ్వు నిద్ర ఎందుకు పోతున్నావు అని అడిగితే సమాధానం చెప్పలేరు. నిద్ర లేకపోతే మానవుడు నీరస పడిపోతాడు. నిద్రలో మనస్సు యింద్రియాల నుండి విడువడి ప్రశాంతత చెందుతుంది. శక్తి వస్తుంది. జాగ్రదావస్థలో మనస్సు సుషుప్తిని పొందటమే ధ్యానం. మనందరి యిల్లు అదే అయింది.

ముందుగా ధ్యానానికి ఒక రూపాన్ని పెట్టుకో. లేదా ఒక నామాన్ని పెట్టుకో. ప్రపంచ విషయాలపై మనస్సు పెడితే అవి వినాశానికి దారితీస్తాయి. గురుదేవులు "ధ్యానం చెయ్యి. ధ్యానం కుదరలేదు అని మధ్యలో లేచిపోతే గమ్యాన్ని చేరలేవు. ధ్యానం చేయటమే నీ వంతు. ఫలితం గురుదేవులే చూసుకుంటారు." అన్నారు. ధ్యానానికి నిటారుగా కూర్చోవాలి. కుర్చీలో కూర్చోవచ్చు. కాని వెనుకకు ఆనుకోకూడదు. లక్ష్యార్థంపై మనసు ఉంటాలి.

శ్రీ కులశేఖరాళ్వార్లు ముకుందమాలలో ..........

బద్ధే నాంజలినా నతేన శిరసా గాత్రైః సరోమోద్గమైః
కంఠేన స్వర గద్గదేన నయనే మోద్గీర్ణ బాష్పాంబునా ।
నిత్యం త్వచ్చరణారవింద యుగళ ధ్యానామృతా స్వాదినాం
అస్మాకం సరశీరుహాక్ష! సతతం సంపద్యతాం జీవితమ్॥

'ధీ' బుద్ధి దేనిమీద నిలబడుతుందో అదే ధ్యానం. ఇదంతా నీదే ప్రభూ! అంటే ఎంతో తృప్తి లభిస్తుంది. విషయాదుల వల్ల, భార్యాపుత్రాదుల వల్ల, భోగభాగ్యాల వల్ల శాంతి రావటం లేదు. దేహానికి మృత్యువు బ్రతికి ఉండగానే రావాలి. అట్టివారికి యిక చావుతో బంధం లేదు. బ్రతికి ఉండగానే దేహాన్ని విలక్షణంగా చూడాలి.

బద్ధే నాంజలినా నతేన శిరసా గాత్రైః సరోమోద్గమైః – శిరస్సు వంచి అంజలి ఘటించాలి. శిరస్సు వంచిన చోట పాదాలను భావించాలి. అప్పుడు ఎంత ఆనందంగా ఉంటుంది! నీ దేవుడు ఎక్కడ ఉన్నాడు అని ఆంజనేయుని అడిగితే గుండెల్లో చూపించాడు. మనం అలా చేయలేక పోయినా, 'నీ హృదయ బాబును రా! నీ హృదయంలో ఉన్నానురా!' అన్నారు గురుదేవులు.

కంఠేన స్వర గద్గదేన నయనైః నోద్గీర్ణ బాష్పాంబునా – ఆవేదనలో వాక్కు తడబడుతుండగా, గద్గదమైన స్వరంతో నీరు నిలిచిన కళ్ళతో గురుదేవులను స్మరిస్తే వారే జాలి కలిగి మనలను దరికి చేర్చుకుంటారు. మనస్సు భగవతత్త్వంలో నిలిచిపోవాలి. గురువును మించినది ఏదీ లేదు.

న గురోరధికం తపః న గురోరధికం జ్ఞానం – గురువే చైతన్యం, మహాశక్తి. అనంతం, గురుదేవులు తమ పదముల ద్వారా (బోధ) మనను ముందుకు నడిపిస్తున్నారు. వారు అందరిలో బ్రహ్మాత్వాన్నే చూస్తారు. వారు మనలను మందలించారంటే అది ప్రేమతోనే. తిరిగి మనల్ని ఎంతో మక్కువతో దరికి తీసుకుంటారు. కాబట్టి విషయాదుల మీద వాసన తగ్గాలి. విశ్వనాధునిపై ప్రేమ పెరగాలి. అటువంటి గురుదేవుల పదములను ధ్యానించండి.

నిత్యం త్వతచ్చరణార విందయుగళ ధ్యానా రసాస్వాదినాం – ఆ ధ్యానం వల్ల వచ్చే జ్ఞానామృతాన్ని ఆస్వాదించాలి.

అస్మాకం సరశీరుహాక్ష సతతం సంపద్యతాం జీవితమ్ – అటువంటి దృష్టిలో మా మనస్సును సర్వకాల సర్వావస్థలలో అందు నిలుపు ప్రభూ!" అని ప్రార్థించాలి.

విచారణ ధ్యానం కన్న మిన్న అన్నారు ప్రభువు. విచారణ ద్వారా ఆచరణలోకి తేవాలి. శరీర దృష్టి పోవాలి. జాగ్రతలో నిజ జాగ్రత స్థితిని పొందాలి. ఏ గుణ దోషాలు లేక, పరమాత్మను గుర్తించటమే జాగ్రతలో నిజజాగ్రత స్థితి. నీ సాధనలో కలిగిన అనుభవాలు ఒక గురుదేవులకు మాత్రమే తెలిపి వారి వద్ద నుండి సమాధానం పొందాలి. కాబట్టి నిర్వేదం పనికిరాదు. ధైర్యం తెచ్చుకో. సాధన చేయకుండానే సాధ్యం కాదని చతికిల పడకు. నిష్కామంతో, భక్తిభావనతో భగవంతుణ్ణి భజించు. నీ దోషాలను ఆ ప్రభువుకు నివేదిస్తే ఆయన నిన్ను తప్పక రక్షిస్తాడు. మన స్వామి ఎదురుగా 'వై ఫియర్ అ యామ్ హియర్!' అన్న అభయం యిస్తున్నారు. ఆ రక్షణ సెక్యూరిటీ చాలు మనకు. శరీరం మార్పు చెందేది. ఏ మార్పు చెందకుండా ఉండేదే బ్రహ్మ. శ్రీగురుదేవులు యివన్నీ కూడా చెప్పలేదు. హాయిగా నామం చేసుకోరా అన్నారు. నామం అంటే ప్రసాదిత లక్ష్యార్థమే. ఆ లక్ష్యార్థం రూపానికి భిన్నం కాదు. అట్టి గురుదేవులు మనకు ఆధారంగా ఉండబట్టే మనం మనగలుగుతున్నాము. ధ్యానం మన స్వరూపమై ఉన్నది. మనస్సుని ఆత్మ శక్తి ప్రకాశింపజేస్తోంది. ఆ ఆత్మే గురుదేవుడు. అట్టి గురుదేవులు సర్వదా రక్షించు గాక!!

*

# ధర్మోరక్షతి రక్షితః

– సుశీలా ప్రసాద

తల్లిదండ్రుల ప్రేమను ఎంతో కాలం అనుభవించలేకపోయి, తప్పనిసరియై చేరదీసిన బంధువుల యీసడింపులతో పెరిగి, వారికి భారంగా తోచగా, ఒక ధనవంతుడికి బానిసగా అమ్ముడుపోయి, నిత్యమూ ఒళ్ళువిరిగేలా బండ చాకిరీతో నరక బాధలకు గురి అవుతూ జీవిస్తున్న ఒక అభాగ్యుడు అంబాదాసు. తాడు తెగేదాకా లాగితే ఏమవుతుంది? ఒకనాడు సహించలేక అంబాదాసు యిల్లు విడిచి పారిపోయాడు.

చురుక్కున ఎండ మొహం మీద పడేసరికి మెలకువ వచ్చింది. ఎంతసేపు అలా నిద్రపోయేడో అతనికే తెలియదు. పూర్తిగా నిద్ర మత్తు వదలక బలవంతంగా కళ్ళు విప్పి చూశాడు. లీలగా తన ఎదుట కనబడిన దృశ్యాన్ని చూసి గుండె ఆగినంత పని అయింది. ఎదురుగా తనవంకే చూస్తూ కూర్చుని ఉన్న క్రూరమైన సింహం! మరో క్షణానికి తను దాని నోట్లో ఉండటం ఖాయం!

రోజూ చస్తూ బ్రతుకుతున్న తన నీచమైన జీవితాన్ని తప్పించుకోవాలని పారిపోయి వచ్చింది ఇలాగా చచ్చి పోవటానికేనా? భయంతో వణుకుతూ కళ్ళు మూసేసుకున్నాడు. శరీరం ఎలాంటి చిత్ర హింసకు గురౌతుందో ఊహించుకుంటూ క్షణాలు గడిపేవానికి ఏమౌతోందో తెలియ లేదు. కాని మెత్తగా తన చేతిని తాకుతున్నదేదో!

కళ్ళు తెరిచి చూశాడు. అంత భయంకరకమైన జీవి సాధువైన గోవులాగ తన కాలిని అంబదాసుకు ఆనించి చూపుతున్నది. అదేమి తనని చేయబోవటం లేదని అర్థమయ్యాక స్థిమితపడి దానివంక పరికించి చూశాడు. కాలిలో చాలా పెద్ద అడవిముల్లు దిగబడింది. లోపలికి గుచ్చుకుపోయి నెత్తురు ఓడుతున్నది. అది నోటితో చెప్పలేకపోయినా దాని పరిస్థితిని అంబాదాసు గుర్తించాడు.

పాపం! చాలా బాధపడుతోంది. దాని కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. వెంటనే అతడు దాని కాలిని గట్టిగా పట్టుకుని ముల్లు లాగిపారేశాడు. దాని కాలికి తన మొలన ఉన్న గుడ్డను తీసి కట్టుకట్టాడు. సొమ్మసిల్లి పడిపోయి ఉంది సింహం. పక్కనే ఉన్న అడవిలోకి వెళ్ళి ఆకులుతెచ్చి పసరుకూడా పోశాడు. చుట్టుప్రక్కల వెతికి అది తినేందుకు ఆహారాన్ని సంపాదించి దానికి పెట్టాడు. ఇలా వాళ్ళిద్దరూ జాతివైరం లేకుండా సహజీవనం గడిపారు.

ఇప్పుడు సింహం కాస్త నడవగలుగుతున్నది. అతని వెనకే నడుస్తున్నది. కానీ ఎక్కువగా తిరగవద్దని అంబాదాసే దానికి ఆహారం తెచ్చిపెడుతున్నాడు.

అలాటి వేళలో, భగవంతుడు ఏ చిత్రమైన నాటకం ఆడిస్తాడో తెలవదు. ఒకనాడు అడవిలో తిరుగుతున్న అంబాదాసును, అతన్ని వెతుక్కుంటూ వచ్చిన వాని యజమాని పంపిన సేవకులు బంధించి తీసుకుపోయారు. మంచిని చవిచూస్తున్నవానికి తిరిగి చెడు ఎదురైంది. తన బానిస తనను మోసంచేసి పారిపోయాడనే నేరాన్ని మోపి, అంబాదాసును రాజు ముందు నిలబెట్టాడు. ఆ రాజు న్యాయాన్యాయ విచారణ చేయకుండా ధనవంతుని పక్షమై, వెంటనే అంబాదాసుకు మరణశిక్ష విధించాడు.

విశాలమైన పెద్ద మైదానంలో శిక్ష అమలు జరిగేటప్పుడు ప్రజలంతా చూడాలని గుంపులుగా చేరారు. కాళ్ళు చేతులు బంధించి అంబాదాసును అక్కడ నిలబెట్టారు. తనకి ప్రపంచంతో సంబంధం తెగిపోతున్నదన్న పూర్తి విరక్తితో ఎటూ చూడక అంబాదాసు కళ్ళు మూసుకుని ఉన్నాడు. ఆ సమయంలో ఒక బోనుతెచ్చి వాని ముందు పెట్టారు. అందులో ఆకలితో ఉన్న సింహం పెద్దగా గర్జిస్తున్నది. రాజు ఆనతి మీద భటులు బోను తలుపులు తెరచి దూరంగా వెళ్ళిపోయారు. సింహం అంబాదాసుపైకి దూకింది. క్షణంలో సగం సేపు ...... ఆ సింహం అంబాదాసును చూస్తూనే దగ్గరగా వెళ్ళి మోకరించి, వాని చేతిని కుక్కపిల్లలాగా నాకసాగింది. తనకెంతో పరిచయమున్న ఆ స్పర్శతో ఆంబాదాసు కళ్ళు తెరిచాడు. తన ఎదుట మిత్రుణ్ణి చూస్తుంటే కళ్ళవెంట నీళ్ళు ధారగా ఆ సింహం మీద పడసాగాయి. ఆ దృశ్యాన్ని చూస్తూ అందరూ నిశ్చేష్టులయ్యారు!

వాళ్ళంతా చూస్తుండగానే అంబాదాసు చేతికి, కాళ్ళకు కట్టిన తాళ్ళను బలంగా తెంచేసుకుని, ఆ సింహం చేతిని తన చేతితో పట్టుకుని, గుంపును చీల్చుకుంటూ బయటకు పరుగెత్తసాగాడు. అడ్డువచ్చిన వారిని సింహం నోరుతెరచి భయంకరంగా గర్జించింది. దానితో అందరూ వెనక్కి తగ్గారు.

అంబాదాసు ఆ జనాన్ని చూస్తూ "సాటి జీవులను దయలేక హింసించేవారు క్రూరమృగాలే. చేసిన మేలు మరచిపోలేక కృతజ్ఞతతో నా ప్రాణాలు కాపాడిన యీ దయామయి నాకు దైవంతో సమానం. ఇక మా యిద్దరినీ ఎవరూ విడదీయలేరు" అంటూ కృతఘ్నులైన మానవుల నుంచి, మంచికి చోటులేని సంఘం నుంచి దూరంగా, చాలా దూరంగా సాగిపోయాడు.

ఇప్పుడు వారిద్దరూ ఒకరికొకరు రక్షకులు. దయ, ప్రేమ, త్యాగం అనేవి వారిని కాపాడే దైవ రూపాలు. వారి జీవితంలో స్వార్థం అడుగు పెట్టలేదు.

**సర్వభూత దయ మానవ ధర్మం! ఆ ధర్మాన్ని మనం రక్షిస్తే, ధర్మం మనని రక్షిస్తుంది!**

*

# కోతులు పట్టేవాడు

– కొండ వెంకట రాజు

<u>సారు</u> – అనగా అనగా ఒక ఊళ్ళో కోతులు పట్టేవాడు ఒకడు ఉండేవాడు. వాడు కోతులను పట్టి ఆడించి జీవనం గడుపుకునేవాడు. ఇంకో క్రొత్త కోతిని సంపాదించాలి అనుకున్నాడు. ఏం చేస్తాడు? బాగా కోతులు తిరిగే అడవికి వెళ్తాడు. తనతోపాటు ఒక సన్నని మూతి ఉన్న కుండని కూడా తీసుకెళ్తాడు. దానిలో కోతి యిష్టపడే మరమరాలు, పప్పులు గట్రా వేస్తాడు. దానిని కోతులు తిరిగే చోట పెడతాడు. కోతులు చుట్టూ చేరతాయి. కుండలో చెయ్యి పెట్టటానికి కొట్టుకుంటాయి. ఒక బలమైన కోతి మిగతా కోతులన్నిటినీ తరిమివేసి, ఆ కుండలో చెయ్యిపెట్టి, గుప్పెట నిండా పప్పులు పట్టుకుని బయటకి లాగటానికి ప్రయత్నిస్తుంది. చెయ్యి బయటకు వస్తుందా? రాదు. ఎందుకని?? గుప్పిట సైజు పెరిగింది కదా. కుండ సన్నమూతిలో నుంచి చెయ్యి రాదు. కోతి పూర్వం లాగా చెంగుచెంగున పరుగెత్తలేదు. చెట్లు ఎక్కి పారిపోలేదు. ఎందుకంటే కుండ బరువు ఒకటి చేతికి తగిలించుకుంది కదా! పిల్లలూ! మరి చెయ్యి బయటకు రావాలంటే కోతి ఏం చేయాలి??

<u>పిల్లలు</u> – సైలెంట్. సమాధానం లేదు.

<u>సారు</u> – కోతి గుప్పెటను వదిలివేస్తే చెయ్యి బయటకు వచ్చేస్తుంది. దానికి కావలసినంత మాత్రమే తీసుకుని తినవచ్చు కదా. అలా కాదని ఆశకుపోయి, దాచేసుకోవాలని గుప్పెట పడితేనే బంధం ఏర్పడింది. కోతి గుప్పెట వదిలేస్తే బంధం పోతుంది. మానవులు కూడా అంతే. అత్యాశ అనే (కుండ) మాయలో యిరుక్కుపోయాము. మనకు తెలుసు యీ అత్యాశను వదిలితే మనం మాయనుండి విముక్తి పొందుతాము అని. కాని అలా చేయలేము. ఇక ఒక కోతి ఎలా చేయగలుగుతుంది?

అలాగే బలమైన మానవుడు (బలం అంటే శారీరకం, లేదా డబ్బు, లేదా పలుకుబడి, రాజకీయం, లేదా పదవి యిలా ఎన్ని రకాల బలాలో మానవుడికి??) మిగిలిన సన్నకారు మానవులకి చెందిన వసతులను కూడా తామే లాగేసుకుంటారు. భగవంతుడు ధర్మంగా నీకు చెందినది మాత్రమే తీసుకో అని చెబుతుంటే, మానవుడు దుర్మార్గంగా యితరులను కొల్లగొడుతూ ఉంటాడు. అలాంటివారు పాపాలను మూట కట్టుకుని తిరిగి యింకో జన్మకు (కుంటి కుక్కో, గజ్జికుక్కో, కొండచిలువగానో పుడతారు) పోతుంటారు అని శ్రీబాబూజీ మహరాజ్ చెబుతుండేవారు.

<u>సారు</u> – కోతి చెయ్యి కుండలో నుంచి బయటకు తీయటానికి వాడేమి చేస్తాడు?

<u>పిల్లలు</u> – సైలెంట్ (సమాధానం లేదు)

<u>సారు</u> – కోతి మెడలో ఒక తాడువేసి, కుండలో ఉన్న చెయ్యిమీద గట్టిగా కర్రతో రెండు దెబ్బలు వేస్తాడు. అంతే! కోతి పప్పులు వదిలివేసి, చేతిని కుండలో నుంచి లాగేసింది.

కోతికి మెడలో వేసిన తాడు వాడి చేతిలోనే ఉంది కదా, దానిని తోలుకుని యింటికి పోయాడు.

పిల్లలూ! మీరు కూడా మీ చదువుని అశ్రద్ధ చేసి, ప్రపంచ విషయాదులకి ఎక్కువగా అలవాటు పడితే, మీ చదువులు దెబ్బతింటాయి. మీరు ఎక్కువ సమయాన్ని వ్యాపకాలకి వృధా చేశారనుకోండి, మీ చదువులు నీరసించిపోతాయి. మీవరకు మీకు ఒక చిన్న మాయాలోకం ఒకటి ఉంటుంది. భగవంతుడు ఏమంటున్నాడు? ఈ వయస్సులో మీకు స్వధర్మం బుద్ధిగా చదువుకోవటమే. 'మీరు కనుక మీ స్వధర్మం ఆచరిస్తే మీ వెనకాలే తోడుగా నేనుంటాను' అంటున్నాడు భగవానుడు. బాల్యం పోతే తిరిగి ఆ సమయం రాదు. మరి బాగా చదువుకుంటారా?? $A^+$ గ్రేడ్ వస్తుందా??

పిల్లలు – అవును, అవును $A^+$ గ్రేడ్ తెచ్చుకుంటాము.

సారు – మా బోటి పెద్దలు మాయని ఎదుర్కోవాలంటే సత్యగురువును ఆశ్రయించాలి. కోతిని పట్టుకొనేవాడు ఆ కోతి చేతి మీద ఎలా దెబ్బలు వేశాడో, గురువు కూడా అవసరం అయితే శిష్యుడితో కఠినంగా వ్యవహరించి అయినా సరే మాయ నుండి బయట పడేలాగ చేస్తాడు. పెద్దయ్యాక మీరు కూడా ఒక సత్య గురువుని ఆశ్రయించండి. ఆ గురువు యందు అఖండమైన భక్తిని, విశ్వాసాన్ని అలవరచుకోవటానికి ఈ నాటి నుండే మంచి మంచి బీజాలను నాటుకోండి. శ్రీసద్గురుదేవులు అట్టి అఖండమైన భక్తిని, శ్రద్ధని, మంచి చదువును మీకు ప్రసాదించుగాక!!

*

నా ఎదురుగా గురువు, భగవంతుడు యిద్దరూ నిలిచినచో ముందుగా గురువుకే పాదాభివందనము చేస్తాను. ఎందుకంటే భగవంతుని దర్శించే మార్గం గురువే తెలిపాడు. అందుకే భగవంతుని కంటె నాకు గురువే ఎక్కువ

– భక్త కబీర్

అహంకారపు శుద్ధ స్వరూపము రెండు అవస్థలకు లేక రెండు భావాలకు మధ్య ఉండే విరామ కాలంలో తెలియబడుతుంది. ఒక దానిని పట్టుకున్న తరువాత రెండవ దానిని వదలిపెట్టని గొంగళి పురుగు వంటిది అహంకారం. విషయాలతోను, భావాలతోను సంబంధం లేకుండా ఉన్నప్పుడే దాని నిజ స్వరూపం వ్యక్తమవుతుంది. కనుక మనం అనుభూతమొనర్చుకొన వలసినది యీ విరామ కాలాన్నే

– శ్రీ రమణ భగవాన్

# భక్తి భావనే సర్వోత్కృష్ట సాధన

–వసిష్ఠ

మానవుడు అనేక యంత్రాలను కనుగొని అవన్నీ తన ప్రజ్ఞవలనే కనుగొన్నట్లు అనుకుంటాడు. కాని తాను కూడా తనలో ఉన్న 'చైతన్య మహాశక్తి' చే నడుపబడే యంత్రమని తెలుసుకోలేడు. అతనిలో నుంచి అద్భుత శక్తి ప్రకటితమవుతున్న మాట నిజమే. కానీ యీ నానావిధ యంత్రాంగములను కనుగొనే బుద్ధి విశేషము అతనికి ప్రసాదించినది ఎవరు? నిగూఢ చైతన్యశక్తి లేకుండా గడ్డిపోచను కూడా ఎవరూ కదల్పజాలరు. ఎంతటి స్పెషలిస్ట్లైన డాక్టర్లు కూడా యీ విషయంలో ఏమీ చేయలేరు. ఆ కదలలేని స్థితి మనకు వారికి సైతము తప్పదు.



మనసు ఒక సినిమా రీలు వంటిది. అది పూర్వజన్మల వాసనలు సంకల్పాలు ఆ రీలులో ఉంటాయి. మనలోని ఆత్మజ్యోతి అనే మహాదీపానికీ, ఎదుటితెరపైన దృశ్యానికి మధ్య అది త్రిప్పబడుతూ ఉంటుంది. సమస్త ప్రపంచమునూ, సంసారమునూ ఆ తెరపై మనం చూస్తాము. కాని ఆత్మ జ్యోతి నుండి వెలువడే ఆ తెల్లని జ్యోతి మనకు కనిపించదు. మనసు అనే ఆ రీలులో ముద్రితమై ఉన్న బొమ్మలు ధ్యానమనే ప్రక్రియ ద్వారా తుడిచివేయబడినప్పుడు మనకు కనిపించేది ఆ తెల్లని వెలుగే. అదియే నిజమైన ఆత్మజ్యోతి దర్శనము. జగత్తుగా మనకు కనిపించేది ఆ ఆత్మజ్యోతియొక్క వికృతిరూపమే. మనో మాలిన్యం ద్వారా వికృతమైన రూపం అది. ధ్యానమనే అగ్నితో ఆ మాలిన్యం దగ్ధం చేయబడినప్పుడు మనకు కానవచ్చేది స్వచ్ఛమైన జ్ఞానజ్యోతియే.

గీతాచార్యునివంటి సమర్థ సద్గురుని ఆశీర్వచనము చేత మాత్రమే అట్టి సహజ స్థితి కలుగుతుంది. ఇందుకు ఆ సద్గురుని యందు అచంచల భక్తి, విశ్వాసములు కుదరటం అవసరం. మనసు గోడమీద బల్లి వలె, శరీరంపైన పుట్టుమచ్చవలె గురు పాదములను (పరమాత్మను) అంటుకుని ఉండటం నేర్చినప్పుడే అది సాధ్యమవుతుంది.

ఒక గురువు ఒక శిష్యుడు కలిసి ప్రయాణం చేస్తుండగా ఒక నదిని దాటవలసి వచ్చింది. పరమాత్మయందు లగ్నమనస్కుడైన గురువు నది మీద అవలీలగా నడిచి పోతున్నాడు. శిష్యుడు కూడా అలాగే ప్రయత్నించాడు కాని, అతని మనస్సు అస్థిరమై ఉన్నందున అతను ఆ నదిలో మునిగిపోతూ "ఆర్యా! నేను మునిగిపోతున్నా"ని ఆక్రోశించాడు. "గురునామం కీర్తిస్తూ ముందుకు సాగ"మని హెచ్చరించాడు గురువు. శిష్యుడు అలా చేయటంతోనే నదిపై నడవగల శక్తి అతనికి వచ్చింది. కాని అంతలోనే అతని మనస్సులో ఒక వితర్కం బయలుదేరింది. "మా గురువు కూడా నా వంటి

మానవుడే కదా! నాలాగే ఆయన కూడా అన్నం తినటం మొదలైన పనులు చేస్తున్నాడు కదా! ఆయనలోని ప్రత్యేకత ఏమిటి? నేను ఆయన నామసంకీర్తన ఎందుకు చేయాలి?" అనుకున్నాడు. వెంటనే అతను మరల నీటిలో మునిగిపోసాగి, "ఆచార్య దేవా! మునిగి పోతున్నా"ని మరల కేక పెట్టాడు. గురువు "విశ్వాసంతో గురు నామం స్మరించమ"ని హెచ్చరించాడు. శిష్యుడు అలాగే చేసి, మరల నీటిలో తేలాడు. కాని అంతలోనే అతని మనస్సు తిరిగి వక్రించి, గురువును విమర్శించ మొదలుపెట్టగా మరల నీట మునగ జొచ్చి గురువును తిరిగి అర్థించాడు. ఈసారి మారుపలుకకుండా గురువు ముందుకు సాగిపోయాడు. శిష్యుడు తన మనస్సుమూలంగానే నీట మునిగిపోయాడు.

గురు శిష్య సంబంధం రెండు విధాలు. 1. మార్జాల కిశోరన్యాయం. 2.మర్కట కిశోర న్యాయం. మొదటి దానిలో పిల్లి తన కూనలను నోటకరచుకుని, నెమ్మదిగా, కడు జాగ్రత్తగా దారిలో ఎట్టి ఉపద్రవాలూ కలుగకుండ ఒక సురక్షిత స్థలానికి కొనిపోయి అక్కడ ఉంచుతుంది. ఆ కూనలకు తమ రక్షణ విషయమున ఎట్టి బాధ్యత ఉండదు. బాధ్యత అంతా తల్లిపిల్లిదే. అదే రీతిగా గురువు తన శిష్యుని చేయి పట్టుకుని దారి పొడవునా రక్షణ అతనికి అందిస్తూ క్షేమంగా గమ్యస్థానానికి చేరుస్తాడు. గురువు నందు భక్తి విశ్వాసములతో ఉండుట తప్ప శిష్యులు చేయవలసినదేమియు లేదు.

మర్కట కిశోర న్యాయం దీనికి భిన్నం. ఇక్కడ తల్లికోతి తన పిల్లతో ఇష్టం వచ్చినట్లు కదిలిపోతుంటే ఆ పిల్లకోతే తన తల్లిని కౌగలించుకుని ఉంటుంది. తమ రక్షణ బాధ్యత అంతా పిల్లదే కాని తల్లిది కాదు. అదే విధంగా శిష్యుడు గురువును అనుసరించటం వలన తన రక్షణ భారం తనే వహిస్తూ ఉంటాడు. ఇందులో ప్రమాదం వాటిల్లటానికి అవకాశం ఉంది.

ఒక పండితుడు భాగవత గ్రంథమును ప్రత్యేకంగా అధ్యయనం చేసి, తాను తెలిసికొన్నది మహారాజుగారికి వినిపించాలనే కోర్కెతో ఆయన దగ్గరకు వెళ్ళాడు. ఆ రాజు అలాగే వింటానని వాగ్దానం చేసి, వినిపించే ముందు మరల 'ఒకసారి గ్రంథమును పరిశీలించి రండి' అని చెప్పి పంపించాడు. పండితుడు కొన్నిరోజుల తరువాత వచ్చాడు. మహారాజు మళ్ళీ అదే చెప్పిపంపిచాడు. మూడోసారి కూడా అలానే జరిగేసరికి పండితుడికి మహారాజు చెప్పినదానిలో ఏదో గూఢార్థం ఉందని అనిపించి, భాగవత గ్రంథాన్ని శ్రద్ధగా పరిశీలించాడు. దానివలన తనకెట్టి మహాప్రయోజనం కలుగగలదో అప్పుడతినికి తెలిసింది. చరాచర జగత్తునంతకు రక్షణనిచ్చే ప్రభువుకు నేను బరువు అవుతానా? అనే భావన వచ్చి అతనింట్లోనే ఉండిపోయాడు. అప్పుడు మహారాజే స్వయంగా పండితుడి యింటికి వచ్చి, భాగవతాన్ని వినిపించమని ప్రార్థిస్తాడు. పండితుడు "భగవంతుడే నాకు అండగా ఉన్నాడని గ్రహించాను మహారాజా" అన్నాడు. రాజు సంతోషించి అతనికి అనేక కానుకలిచ్చి సత్కరించాడు.

# సూరదాస్ కె భజన్

- రమణ ప్రసాద్

ప్రభు మెరె అవగుణ్ చిత్ న ధరో
సమదరసీ ప్రభు నామ్ తిహారో అపనే పనహి కరో
( చాహెూతొ పార్ కరో)
ఏక్ లీహా పూజామె రాఖత్, ఇక్ ఘర్ వధిక్ పరో।
పారస్ నహీ జానత్ కంచన్ కరత్ ఖరో ॥
ఎక్ నదియా ఎక్ నార్ కహావత్ మైలో నీర్ భరో।
జబ్ మిలికై దోవూ ఎక్ వరన్ భయే సురసరి నామ్ పరో ॥
ఏక్ జీవ్ ఏక్ బ్రహ్మ కహావత్ సూరశ్యామ్ ఝుగరో ।
అబ్‌కీ వేర్ మొహి పార్ ఉతారో నహి పగ్ జాత్ టరో ॥

సూరదాస్ ప్రభువుతో " ప్రభూ! నాలో ఉన్న అవగుణాలను పట్టించు కోకు.నీవు "సమదర్శి" అనే బిరుదు కలవాడవు. నన్ను నీ శరణులో చేర్చుకొని ఈ భవసాగరం దాటించు. ఒకరు నిన్ను పూజా గృహంలో పెట్టుకొని పూజిస్తారు.ఇంకొకరు అలంకారంగా పెట్టుకొంటారు. ఈ పరుసవేది ఉన్నదే అది ఇనుముని బంగారంగా మారుస్తుంది. కాని ఆ విషయం దానికి తెలియదు. నువ్వు మమ్మల్ని ఎప్పుడూ కాపాడుతూనే ఉంటావు. నువ్వు "సమదర్శి" బిరుదాంకితుడవు కదా!



ఒకటి నది. ఇంకొకటి కాలువ. రెండిటిలో నీరు ప్రవహిస్తూ ఉంటుంది. రెండూ సముద్రంలో కలిసి ఏక రూపం పొందుతాయి. అప్పుడు అవి తమ పూర్వ రూపాలను కోల్పోయి " సముద్రం" అని పిలువబడతాయి. ఈ జీవుడిలో ఉన్నది నీ ప్రకాశమే. ఈ భేదాన్ని గుర్తించినవాడు నీలో లయమవుతాడు. జీవుడే బ్రహ్మ అవుతాడు. అలా చేసే శక్తి నీలోనే ఉంది.

ఒకడు 'నేను జీవుడిని' అని వాదిస్తాడు. ఇంకొకడు 'నేను బ్రహ్మని' అంటాడు.అంతటా నువ్వే అయినప్పుడు ఇంక భేదం ఎక్కడిది? అంటున్నాడు. సూరదాసు 'ప్రభూ!నన్ను భవసాగరం దాటించు. సమదర్శివి కదా! నీ బిరుదుకు కళంకం రానీయవులే" అని ప్రార్థించాడు సూరదాసు.

*

# భగవానుడు సర్వవ్యాపి

– శ్రీవిద్యా ప్రకాశనందాగిరి స్వామి

ఒక కాలేజీ విద్యార్థి పెద్దపరీక్షలు సమీపించినప్పుడు తాను గణిత శాస్త్రంలో వెనుకబడి ఉండటం చేత పరీక్షలో పాస్ అవటం కష్టమని తలచి ఆ గ్రామంలోని దేవాలయంలోకి పోయి దేవుడికి నమస్కరించి “మహానుభావా! రేపు నాకు గణిత పరీక్ష. ఆ విద్యలో నాకు ప్రావీణ్యం లేదు. పరీక్ష తప్పితే నలుగురిలో నగుబాటుగా ఉంటుంది. కాబట్టి దయ ఉంచి, దానిలో నన్ను పాస్ చేస్తే నీకు, పులిహోర, చక్కెర పొంగలి చక్కని నైవేద్యం సమర్పించుకుంటాను” అని మొరపెట్టుకుని యింటికి వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు లెక్కల పరీక్ష. ప్రశ్నాపత్రాలు యిచ్చారు. మన విద్యార్థికి కూడా యిచ్చారు. అతని ఆనందానికి మేరలేదు. అన్నీ తనకి తెలిసిన లెక్కలే కాబట్టి అమిత ఆనందంతో భగవానుడికి జోహారు అర్పించుకుంటూ చకచక అన్ని లెక్కలు ఒక గంటలో చేసేశాడు. పరీక్షకాలం మూడుగంటలు యిస్తారు. కాబట్టి మన విద్యార్థికి యింకా రెండు గంటల టైము మిగిలింది. ఊరికే కూర్చోవటం ఎందుకని వాడు కొన్ని తెల్లకాగితాలు తీసుకొని దానిమీద మరుసటి రోజు భగవంతునికి సమర్పించవలసిన నైవేద్యానికి కావలసిన వస్తువుల జాబితా తయారుచేయటం మొదలు పెట్టాడు.

పులిహోరకు బియ్యం, నూనె, చింతపండు, ఎండిమిర్చి, పసుపు, పోపు సామానులు మొదలైనవి, చక్కెర పొంగలి కొరకు బియ్యం, చక్కెర, నెయ్యి, పెసర పప్పు, జీడిపప్పు, ద్రాక్ష మొదలైనవి ఎంత ఎంత కావాలో లిస్ట్ వ్రాసుకున్నాడు. ఇంతలో అతనికి ఒక ఆలోచన వచ్చింది.

భగంతుడికి రుచులెందుకు? విలాసములెందుకు? కాబట్టి, ద్రాక్ష అనవసరం. జీడిపప్పు అంతకంటె అనవసరం అని ఆ రెండు పేర్లను, దానికయ్యే ఖర్చును జాబితాలో కొట్టేశాడు. తిరిగి కొంచెం సేపు ఆలోచించి, చక్కెర సగానికి సగం తగ్గించాడు. తరువాత గీతలోని ‘కట్వామ్ల లవణాత్యుష్ణ’ అనే శ్లోకం జ్ఞాపకం వచ్చి, దేవుడికి పులుపు, కారం యిష్టం లేదని పులిహోర కొట్టేశాడు.

చివరకు ఇంకో ఆలోచన వచ్చింది ‘పత్రం పుష్పం ఫలం తోయం’ అన్నారు కదా యివి యిచ్చుకుంటే చాలదా? ఇంత ఖర్చు ఎందుకు అనవసరం? అని భావించి. చక్కెరాంగలి కూడా లిస్ట్‌లో నుంచి తీసేశాడు. ఫలము, పుష్పము కూడా యీ రోజుల్లో బోలెడు డబ్బులు పెడితే కాని రావటం లేదు. ఒక్క తోయము (నీరు)

దొడ్లో బావిలో పుష్కలంగా ఉంది కాబట్టి దిగులు లేదు ఆ నీరు సమర్పిస్తే చాలు అనుకున్నాడు.

మళ్ళా ఇంకో ఆలోచన చేశాడు. నీళ్ళు బావిలో నుండి తోడటం యీ కష్టం ఎందుకు? మానసికంగా నీళ్ళు సమర్పించిన భావన చాలదా? అనుకున్నాడు. ఈ ప్రకారం మనస్సులో ఆలోచనలు పరుగెడుతుంటే పరీక్షా సమయం పూర్తి అయి, పరీక్షాధికారి దగ్గరకు వచ్చి 'జవాబు కాగితములు త్వరగా ఇవ్వు' అని అరిచాడు. ఆ తొందరలో విద్యార్థి లెక్కల పేపరుకు బదులు, పులిహోర చక్కెరపొంగలి లిస్ట్ పేపరును ఆ అధికారి యిచ్చేసి, యీ లెక్కల పేపరును జేబులో పెట్టుకుని యింటికి వచ్చేశాడు.

ఇంటికి రాగానే తండ్రి 'ఏరా? పరీక్ష బాగా రాశావా?' అని అడిగితే 'అద్భుతంగా రాశాను నాన్నగారు, భగవంతుడు నన్ను కరుణించాడు. అన్నీ తేలిక లెక్కలే, నాకు తెలిసినవే వచ్చాయి' అని ఆనందంగా జవాబిచ్చాడు. 'ఏదీ ప్రశ్నాపత్రం నాకు చూపించు' అని అడిగేసరికి, తన జేబులో నుంచి కాగితం తీసి తండ్రికిచ్చాడు. అది చూసి తండ్రి అదిరిపడి, 'అదేమిట్రా? లెక్కల ఆన్సర్ పేపరు అధికారికి యివ్వకుండా యింటికి తెచ్చావు? అయ్యో! ఎంత పొరపాటు చేశావు?' అని గట్టిగా మందలించాడు. అది చూసి మన విద్యార్థి లోలోనే కుంగిపోయాడు.

"అయ్యో! నేను దేవుడిని మోసం చేయాలని ప్రయత్నించాను. దానికి ఫలితంగా నేనే మోసపోయాను. ఇంకెప్పుడు యిటువంటి పని చెయ్యను. దయామయా! భగవంతుడా! నీవు నాపై కరుణ చూపించి, గట్టెంక్కించాలని చూసినా కూడా నేనే దుర్బుద్ధితో చేతులారా దానిని జారవిడుచుకున్నాను. ఇకమీద ఎప్పుడూ నాకు యిటువంటి దుర్బుద్ధి కలుగకుండుగాక!" అని ప్రార్థించాడు.

కాబట్టి భగవంతుని ఉనికి ఏదో ఒక చోట మాత్రం ఉందని తలచకూడదు. బ్రహ్మాండమందలి ప్రతి అణువులో, జీవుని యొక్క ప్రతి సంకల్పంలో ఓతప్రోతమై వెలుగుతున్నాడని నిశ్చయించుకోవాలి. భగవంతుడు ప్రతి హృదయములోదాగి ఉండి అతి సూక్ష్మాతిసుక్ష్మమైన సంకల్పములను కూడా వీక్షిస్తాడు. ఇంక బాహ్య కార్యాలను గురించి వేరుగా చెప్పాలా? కాబట్టి దేవుని ఎవరూ మోసగింపలేరు. ఒక వేళ మోసగించాలని ప్రయత్నించినా తానే స్వయంగా పతనమైపోతాడు.

**ప్రతి మానవుడు భగవానుడు సర్వత్ర వెలయుచున్నాడని గ్రహించి మనస్సులో ఏ దోషమూ లేక నిర్మలమైన జీవితాన్ని గడపాలి.**

*

# కాలాతీతుడు

- జగం

గురు మహిమ అనంత మైనది. సత్య గురుదేవునకు సాధ్యం కానిది లేదు. వారికి కారణాకారణములు లేవు. శరీరం మెలకువలో ఉన్నా కూడా ఏం జరుగుతుందో మనసుకు తెలియకపోవటమేమిటి? అది ఎలా జరుగుతుంది? అదే మహిమ. మహామమహిమ! సత్యసద్గురు మహిమ!

కాలాన్ని శాసించేవాడికి కాలంతో నిమిత్తం లేదు. బాబూజీ ఎల్లప్పుడూ ఉన్నారు అనటానికి యిదొక ఉదాహరణ. సుమారుగా 1992సం॥లో జరిగిన సంఘటన.

పశ్చిమగోదావరి జిల్లా పోతునూరు గ్రామంలో కోడూరి అచ్యుత రామయ్య గారు పెద్ద భూస్వామి. ఆ గ్రామానికి ఎవరైనా మహాత్ములు వస్తే వీరి కుటుంబం భక్తితో, ఎంతో ప్రేమతో, ఆదరించి సేవించేవారు. వీరు పురాణ కాలక్షేపం చేయించేవారు. వీరి కోడలు కోడూరి సీతారామాంజనేయమ్మగారిని బాబు 'సక్కూబాయి' అని పిలిచేవారు. అచ్చుత రామయ్యగారి పెద్ద కుమార్తె కొడుకు రాఘవులు. ఇతనికి చదువు అబ్బలేదు. వ్యవసాయపు పనులు చూస్తూ తాతగారితోపాటు యింట్లో ఉండేవారు. బాబు ఎప్పుడు పోతునూరు వచ్చినా రాఘవులు బాబును తమ ఎడ్లబండిలో ఎక్కించుకుని, గుండుగొలను గ్రామానికి తీసుకెళ్ళేవారు. బాబు కనుక గుండుగొలను వస్తే, అక్కడి నుంచి వారిని బండిలో పోతునూరు తీసుకెళ్ళేవారు. రెండు ఊళ్ళ మధ్యదూరం సుమారు 2మైళ్ళు.

ఒకరోజున రాఘవులు గుండుగొలను వెళ్ళి, రెండవ ఆట సినిమా చూసి, కాలినడకన పోతునూరు గ్రామానికి వెడుతున్నారు. "ఏడు కొండల స్వామి! ఎక్కడ ఉన్నావయ్యా? ఎన్ని మెట్లెక్కినా కానరావేమయ్యా?" అని పాడుకుంటూ వెడుతున్నారు.

ఇంతలో "ఒరేయ్, రాఘవలూ! నేనూ వస్తున్నాను ఉండరా" అన్నమాటలు వినిపించాయి. ఎవరా! అని వెనక్కి తిరిగి చూసేసరికి ఎదురుగా శ్రీబాబు!

"బాబుగారా! నమస్కారం బాబూ, రండి. బాబూ! కాస్త ముందుగా కబురుచేస్తే బండి తెచ్చేవాడిని కదా" అన్నారు రాఘవులు.

"ఫరవాలేదురా, సరదాగా కాసేపు నడుచుకుంటూ వెళదాం పద. పోతునూరు పెద్ద దూరమా ఏమిటి? ఓ పని చేద్దాం. అమ్మవారి మీద ఒక పద్యం అందుకో. ఒక చరణం నువ్వు, ఒక చరణం నేను, అలా పాడుకుంటూ వెళ్ళామంటే పోతునూరు యిట్టే వచ్చేస్తుంది. ఏమంటావు?" అన్నారు శ్రీబాబు.

"అలగే బాబూ! మీ యిష్టం" అని, కాసేపు ఆలోచించి "మాణిక్యవీణా

ముపలాలయింతీం, మదాలసాం మంజుల వాగ్విలాసాం" అని పద్యం మొదలు పెట్టారు రాఘవలు.

"శభాష్! భలే పద్యం అందుకున్నావు" అని శ్రీబాబు "మహేంద్ర నీలజ్యుతి కోమలాంగీం, మాంతగ కన్యాం మనసా స్మరామి" చరణం అందుకున్నారు.

"చతుర్భుజే చంద్రకళావతంసే, కుచోన్నతే, కుంకుమరాగశోణే" అని రాఘవలు, "పుండ్రేక్షు పాశాంకుశ పుష్పబాణ హస్తే, నమస్తే జగదేక మాతః" అని బాబు యిలా పాడుకుంటూ నడుస్తున్నారు.

ఇంతలో "రాఘవులూ! నువ్వు నడుస్తూ ఉండు" అన్నారు బాబు.

బాబు ఎదో పని ఉండి ఆగుతున్నారేమో అనుకుని, "సరే బాబూ! త్వరగా వచ్చేయండి. నేను నెమ్మదిగా నడుస్తూ ఉంటాను" అని రాఘవులు "మాతా మరకత శ్యామా! మాతంగీ మధుశాలినీ....." అని పద్యం పాడుతూ నెమ్మదిగా ముందుకు నడుస్తున్నారు రాఘవులు.

కొంతదూరం నడిచాక వెనక్కి తిరిగి చూస్తే, శ్రీబాబు కనబడలేదు. "బాబూ! బాబూ!' అని గట్టిగా పిలిచారు రాఘవులు. సమాధానం లేదు. "కాసేపు ఇక్కడే కూర్చుని చూస్తాను బాబు వస్తారేమో" అని అనుకుంటూ అక్కడే ఉన్న ఒక బండరాయి మీద కూర్చున్నారు రాఘవులు. పాటలు పాడుతూ చాలాసేపు గడిపారు. ఎక్కడా బాబు అలికిడి లేదు.

"చెప్పాపెట్టకుండా ఎక్కడికో వెళ్ళిపోవటం బాబుకు అలవాటే కదా! ఎవరినో ఉద్ధరించటానికి ఎటోవెళ్ళిపోయి ఉంటారు బాబు. నా అదృష్టం బాగుంటే ఆయనే తిరిగి వస్తారు" అనుకుని తిరిగి నడక ప్రారంభించారు రాఘవులు.

ఇంచుమించు పోతునూరు పొలిమేరకు వచ్చాక. రాఘవులు మనస్సు సంభ్రమాశ్చర్యాలకు లోనై, శరీరం పులకరించింది. "అయ్యబాబోయ్! మా మతి మండ! ఏమి లీలండి బాబూ మీది! మీరు నాకు ఇప్పుడు కనిపించటమేమిటి? నన్ను పిలవడమేమిటి? నాతో కలిసి నడవటమేమిటి? మాహప్రభో! మీరు సిద్ధి పొందిన నాలుగు సంవత్సరాలకు నాకు భలే దర్శనమిచ్చారు బాబూ! నాకు దర్శనమిచ్చి నన్ను ధన్యుణ్ణి చేశారు బాబూ! 'ధన్యధన్యహెూ! సద్గురురాయ!" అని పాడుకుంటూ రాఘవులు ఆనంద తాండవం చేశారు.

గమనిక – శ్రీబాబు 1988 డిసెంబర్ 3 శనివారం నాడు సిద్ధిపొందారు.

"సర్వకాలాలలోనూ ఉన్నానని, మీరు భలే నిరూపించుకున్నారు బాబూ!"

వందనమో దేవా! కాళీప్రసాద దేవా! గురుదేవా! మహానుభావా!

*

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, హైదరాబాదు నివాసస్థులు అయిన శ్రీమతి ధారా భవానీగారు 14-5-2013 మంగళవారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 65సం॥లు. వీరు గత కొద్ది కాలముగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరికి భర్త, ఇద్దరు కుమారులు, కోడళ్ళు, ఒక కుమార్తె, అల్లుడు, మనుమలు, మనుమరాండ్రు కలరు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

***

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన శ్రీమతి బాదరవాడ మోహన కాళీమాత (అబ్బీగారి భార్య) 1-6-2013 శనివారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరు గత కొద్ది సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు, అళ్ళుళ్ళు, మనుమరాండ్రు కలరు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

***

శ్రీబాబూజీ చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన శ్రీమతి దుర్గంపూడి విశాలాక్షిగారు 3-6-2013 సోమవారం నాడు శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 75సం॥లు. వీరు గత కొద్ది కాలముగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వీరికి ముగ్గురు మనుమరాండ్రు, మునిమనుమరాండ్రు కలరు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరుగాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియ జేస్తున్నాము.

***

శ్రీబాబూజీ భక్తులైన శ్రీమతి దివ్వెల ధనలక్ష్మి (పి.శోభనాద్రిగారి చెల్లెలు) 11-6-2013 మంగళవారం శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 61 సంవత్సరాలు. వీరికి ఒక కుమారుడు, కోడలు, నాలుగురు కుమార్తెలు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాండ్రు కలరు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

***

# మానవ నైజం

-పి. వి. సుబ్బారావు

రామాపురం జమిందారు తీవ్రంగా అస్వస్థులై ఉన్నప్పుడు, ఔషధాలు సేవించటంతోపాటు, ఆంజనేయ స్వామిని ఏకాగ్రతతో మండలం రోజులపాటు ధ్యానిస్తే తప్పక మామూలు మనిషి కాగలడని ఎవరో పెద్దలు చెప్పారు.



జమిందారు నాలుగురోజులు ఆంజనేయ స్వామి గుడికి వెళ్ళాడు కాని, ఎకాగ్రత కుదర లేదు. తనకు ఏకాగ్రత కుదిరేందుకు ఏదైనా ఉపాయం ఉంటే చెప్పమని జమిందారు ఆ ఆలయ పూజారిని కోరాడు.

"ఈ మండలం రోజులు కోతి రూపం మాత్రం మీ మదిలోకి రాకుండా జాగ్రత పడాలి. ధ్యాన సమయంలో మీ మనస్సులోకి ఏ రూపం వచ్చిందీ, మండలం తరువాత కాని బయటకు చెప్పకూడదు. మధ్యలో మాట తప్పితే మీ ప్రాణానికే ప్రమాదం" అని సలహా యిచ్చాడు.

నలభై రోజులు గడిచిపోయాయి. ఆ తరువాత జమిందారు పూజారితో, "ఈ నలభై రోజులూ ఎంత వద్దన్నా కోతి రూపమే వచ్చి నా మనస్సులో నిలిచిందండీ" అన్నాడు దిగులుగా.

"ఇంకేం? మీ ప్రయత్నం ఫలించింది. కూడదనుకున్న వాటిమీదనే మనసు లగ్నం అవుతుంది. అదే మానవ నైజం. అందుకే నేను మీకు ఆ సలహా ఇచ్చాను" అన్నాడు పూజారి నవ్వుతూ.

*

# సజ్జన సాంగత్యం

R.TC.లక్ష్మి

ఒకసారి ఒక సముద్రంలో పెద్ద పడవకి చిల్లుపడి మునిగి పోయి అందులోని ప్రయాణీకులందరూ మరణించారు. ఆ సమయంలో ఒడ్డున ఉన్న యోగానందుడనే సన్యాసితో అతని శిష్యులలో ఒకడు "స్వామీ! వారంతా అలా ఎందుకు మరణించినట్లు?" అని ప్రశ్నించాడు.

"వారు పాపాత్ములు కాబట్టి భగవంతుడు ఆ విధంగా వాళ్ళని శిక్షించాడు" అని బదులు చెప్పాడు యోగానందుడు.

"మరి పుణ్యాత్ములు కూడా వారిలో కొందరు ఉండి ఉంటారు కదా! ఆ అమాయకులను ఎందుకు శిక్షించినట్లు?" అడిగాడా శిష్యుడు.

"వాళ్ళు పాపాత్ములతో చేరి ఉండటమే వారు చేసిన నేరం" చెప్పాడు యోగానందుడు.

శిష్యుడు ఆగ్రహంతో "ఆ భగవంతుడు అమాయకులను శిక్షించడం నేరం" అని గట్టిగా అరిచాడు.

యోగానందుడు నిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

ఒకనాడు యోగానందుడు శిష్యులతో అడవిలో విశ్రమించి ఉండగా, చీమల పుట్టలో నుంచి కొన్ని చీమలు శిష్యుడి కాలిమీద పాకి అతడి పాదాన్ని కుట్టాయి. ఆ శిష్యుడు కోపంగా వాటిని నలిపి చంపేశాడు.

"ఏం నాయనా! నీవు చంపిన చీమలన్నీ నిన్ను నిజంగా కుట్టాయా?" అని యోగానందుడు శిష్యుణ్ణి ప్రశ్నించాడు.

"అబ్బే! అన్నీ కుట్టి ఉండవు" అన్నాడా శిష్యుడు.

యోగానందుడు చిరునవ్వు నవ్వి, " మరయితే అమాయకమైన వాటిని కూడా చంపేశావే? భగవంతుడి న్యాయాన్ని విమర్శించి, మరి నీవు చేసినదేమిటి?" అని అడిగాడు.

అప్పుడు శిష్యుడికి దుష్టులతో చేరిన అమాయకులకు కూడా శిక్షఅనుభవించటం సబబే అనిపించింది.

*

# శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు
# అందరూ ఆహ్వానితులే!

శ్రీసర్వాధిష్ఠాన చైతన్య విశ్వమత ప్రవక్త సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ పుణ్యారాధనములు కాళీవనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీకాళీవనాశ్రమం (శ్రీకాళీగార్డెన్స్), నంబూరులో ది. 20-11-2013 బుధవారం నుండి ది. 1-12-2013 ఆదివారం వరకు పంచయజ్ఞ విధులతో జరుపబడును. నిత్యమూ శ్రీగురుగీతా ప్రచనము, శ్రీసద్గురు శతసహస్ర నామార్చనలు, మహామంగళ హారతులు ఉంటాయి.

విశేష కార్యక్రమాలు -

నవంబర్ 20 నుండి బ్రహ్మశ్రీ కొండూరి రామబ్రహ్మంగారి ఆధ్వర్యంలో హెూమము జరుగును.

నవంబర్ 24, 25, 26 తేదీలలో సాధుధర్మ సమ్మేళనము.

నవంబర్ 27న యతీశ్వర పూజలు.

ఈ ఉత్సవాలలో అఖండ హరినామ సంకీర్తన, సామూహిక సద్గురుపాద పూజలు, నౌకావిహారము, ఊంజల సేవ, నగరోత్సవములు ఉంటాయి.

ఈ కార్య క్రమాలలో ప్రతి భక్త హృదయము పాల్గొనాలని మా ఆకాంక్ష. ఈ కార్యక్రమాలలో పాల్గొనుటకు వీలుగా శలవు పెట్టుకునేందుకు ముందుగా తెలియచేయుచున్నాము.

వివరములకు -

ట్రస్ట్ కార్యాలయము - 0863 2293564

కుమారస్వామి రాజా - 93465 35357

మురళీమోహనవర్మ - 93983 34345

ఎ. కుమారస్వామి - 93945 35357

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి - విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

గురుభక్తికి, గురుసేవా నిరతికి నిర్వచనములనదగిన శ్రీశేషగిరిరావుగారు, చిరంజీవిరాజుగార్ల జీవితాలు ధన్యములు. వారు జీవన్ముక్తులు. వారిని కోల్పోయిన లోటు తీరరానిదని శ్రీబాబు మాటిమాటికి అనేవారు.



వారివురూ ఉన్నంతవరకూ స్వామికి ఏ విషయం గూర్చి కూడా ఆలోచించాల్సిన అవసరం ఉండేదికాదు. "నా ఆంతర్యాన్ని గుర్తించి, నాకు సంబంధించిన పనులన్నీ, నా ప్రమేయం లేకుండానే వాళ్ళే సరిచూసుకునేవారు. నాకు ఎంతో విశ్రాంతిని యిచ్చేవాళ్ళు. నాకు అంతగా ఉపకరించే వాళ్ళు. మళ్ళీ దొరకటం దుర్లభం. వాళ్ళు తమ భక్తిపాశాలతో నన్నే బంధించివేయగలిగిన ధన్యులు. అనుక్షణము వాళ్ళు నా హృదయములోనే నిలిచి ఉంటారు. నా స్మృతిపథంలోనే మెదలుతూ ఉంటారు." అని స్వామి తలచుకునేవారు.

చిరంజీవిరారజుగారి తల్లి శేషమాంబ ఆశ్రమస్థాపన జరిగిన వెంటనే ఆశ్రమానికి వచ్చి స్థిరనివాసులయ్యారు. శ్రీబాబు నివాసమైన విజ్ఞానమందిర్ ప్రక్కనే ఉన్న యింట్లో, రాఘవమ్మగారు, చంద్రతోపాటు నివసిస్తూ, నిరంతరము గురునామ స్మరణ చేస్తూ ఉండేవారు. శ్రీబాబు ప్రతిరోజూ కనీసం ఒక్కసారైనా ఆవిడను పలకరించే వారు. "అమ్మన్నా!" అనే శ్రీబాబు పిలుపు ఏ సమయంలో వినిపించినా, వెంటనే 'బాబూ!' అని బదులు పలికేవారు. చంద్ర తన సాధనానుభవాలను, సందేహాలను ఆమెతోనే చర్చిస్తూ, నిరంతరము ఆమెతో సత్సంగం జరిపేవారు. 1980లో వారు శ్రీబాబు స్మరణ చేసుకుంటూనే స్వస్వరూప లయం పొందారు.

రాజుగారి సోదరి, గుండుగొలను నివాసి అయిన లక్ష్మిగారు శ్రీబాబుకు అపార సేవచేసుకున్న అంతరంగ భక్తురాలు. గృహ పరిస్థితులు అనుకూలించక పోయినా ఆవిడ శ్రీబాబుకు సేవా రూపంగా ఏదో ఒక ఉపాహారం చేసి తెచ్చి యిచ్చేవారు. శ్రీబాబు పూజ చేసుకునే 'అమ్మ గది'లోను, బయట అందమైన ముగ్గులు వేసేవారు. పూల దండలు గుచ్చి పూజకిచ్చేవారు. శ్రీ బాబు చేతికి గోరింటాకు పెట్టేవారు. ఎప్పుడూ గురుస్మరణతోను, గురుభక్తి గీతాలతోను నిద్రాహారాలు కూడా లెక్కచేయకుండా గడిపేవారు. అయినప్పటికీ తమ యింట్లో సేవకు ఎట్టి లోపమూ రానీయకుండా అటు

గృహసేవ, యిటు గురుసేవ కూడా చేస్తూ చరితార్థతను సాధించి, శ్రీసద్గురు సాయుజ్యం పొందిన ధన్యజీవి లక్ష్మిగారు.

స్వామి విశ్రాంతి తీసుకునే గదిలో ఒక చిత్రంపటం ఉంది. శ్రీబాబు సింహాసనా సీనులై ఉండగా, శేషగిరిరావుగారు, చిరంజీవిరాజుగారు పాదపద్మములను సేవిస్తున్న చిత్రపటం అది. దాన్ని రెప్పవాల్చకుండా చూస్తూ నిలిచిపోయిన శ్రీగురుదేవుల నయన కమలాలు వేయి పున్నమి చంద్రుల వెలుగులు విరజిమ్ముతూ, ఆనంద మకరందాలు వర్షించేవి.

2004మే నెల 2, 3, 4, 5 తేదీలలో శ్రీకాళీవనాస్రమములోని వశిష్టాశ్రమంలో సింహాసనాసీనులైన శ్రీబాబును, యిరువైపుల పాదసేవ చేస్తున్న శ్రీశేషగిరిరావు గారిని, శ్రీచిరంజీవిరాజుగారలను పాలరాతితో మలచిన దివ్యమంగళ మూర్తిత్రయ ప్రతిష్ఠా మహొత్సవము, శ్రీ హనుమత్ సద్గురు దక్షిణామూర్తి యాగ సహితముగా పూజ్య మాతాజీ నిర్వహించారు.

శ్రీసద్గురు సన్నిధిలోనే భాగవత పఠనం చేస్తున్న శ్రీలలితానంద సరస్వతీ స్వామినివారి పాలరాతి మూర్తిని కూడా ప్రతిష్ఠించారు. ఎందరెందరో మహాత్ములు, వివిధ ఆశ్రమాధిపతులు కూడా ఆ సందర్భంగా ఆశ్రమానికి విచ్చేసి, సాధు సమ్మేళనంలో పాల్గొని, చక్కని సందేశాత్మక ప్రవచనాలతో గురు తత్త్వ నవనీతాన్ని జిజ్ఞాసువులకు అందించారు.

***

పతివ్రత, భక్తురాలు అయిన ఒక స్త్రీ తన భర్తకు, బిడ్డలకు ఉపచారములు చేస్తూ సదా తన చిత్తాన్ని భగవదాయత్తం చేసి, గృహ ధర్మాన్ని నిర్వహిస్తోంది. కొంత కాలానికి ఆమె పతి మరణించాడు. దహనకార్యము అవగానే ఆమె తన గాజులను తీసివేసి, బంగారు గాజులను ధరించింది. విపరీతమైన ఆమె చర్యను చూసి జనులు ఆశ్చర్య పడ్డారు. ఆమె వారికి సమాధనం చెబుతూ "ఇంతకు ముందు నా భర్త శరీరం గాజు పెంకువలె దుర్బలమై ఉండేది. క్షణభంగురమైన శరీరము శిథిలమైనది. అందుచే ఆయన యిప్పుడు వికార రహితుడై, పరిపూర్ణులై ఉన్నారు. ఆయన శరీరమునకు యిక శిథిలత లేదు. అందుకే నేను సులభంగా చితికే గాజులు విసర్జించి, అంతకంటె స్థిరమైన బంగారు గాజులు ధరించాను" అన్నది.

– శ్రీరామకృష్ణ పరమహంస

# శ్రీ రాధామాధవ రససుధ

- శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

జీవనధనమా! నీకు ఏమి యివ్వాలా అని సదా ఆలోచిస్తూ ఉన్నాను.
నీకు నేను యివ్వదలచిన నా ధనం నీవే.

నీవే నా ప్రాణప్రియుడవు. ప్రియతమా! నేను సదా నీ దాననే.
నీ వస్తువును నీకు అర్పించటంలో అనుక్షణమూ నేనే
నీకు అర్పణ అవుతున్నాను.



ప్రియా! నా మనస్సులోని భావాలను ఎలా వివేక పద
జాలంతో నీకు వినిపించను?
అన్యులకు అనేకులున్నారు. కానీ ప్రియతమా! నాకు
నీవు ఒక్కడవే ఉన్నావు.

నా సాధనలన్నిటికీ నీవే ఏకైక సిద్ధివి.
నీవే నా ప్రాణనాధుడవు. నీవే నా నిత్య సమృద్ధివి.

తను ధన జన బంధాలు విడిపోయాయి. భోగకాంక్ష, మోక్షకాంక్ష అనే వ్యాధులు పోయాయి.
ప్రియతమా! నీ ప్రియ సంయోగం ఒక్కటి పొంది ధన్యురాలనైనాను!

నీ
రాధ



గతసంచిక తరువాయి

-రమణ ప్రసాద్

# జ్ఞానదేవుడు

***జ్ఞానదేవుని దయ చేత విశోబా ఖేచరుడు జ్ఞాని అగుట.***

ఆ పట్టణంలో విశోబా అనే ధనికుడు ఉన్నాడు. ఆ పురంలో అందరూ అతనికి ఋణపడి ఉండటం చేత అందరూ అతనికి భయపడేవారు. అతడు జ్ఞానదేవాదులు సన్యాసి పుత్రులని వాళ్ళని అనేక విధాలుగా అవమానాల పాలు చేసేవాడు. ఒకనాడు దీపావళి పండుగ వచ్చింది. నివృత్తిదేవుడు ముక్తాబాయితో 'ఈనాడు సాధువులకు విందు చేయాలి బొబ్బట్లు కాల్చు" అన్నాడు.



ముక్తాబాయి బొబ్బట్లు కాల్చటానికని మట్టి కుండలు కొనటానికి బజారుకు వెళ్ళింది. కుండలను కొన్నది. విశోబా అక్కడికి వచ్చి మాక్తాబాయిని చూడగానే కోపోద్రిక్తుడైనాడు. "సన్యాసి సంతానమైన ఈ నలుగురు పిల్లలూ గ్రామానికి అపఖ్యాతిగా ఉన్నారు. వీరికి ఎవరూ ఏ సహాయం చేయకూడదు. వీరిని ఈ గ్రామంలోనుంచి వెళ్ళగొట్టాలి" అని ముక్తాబాయి చేతిలో ఉన్న కుండలను పగులకొట్టాడు.

ముక్తాబాయి దుఃఖవదనంతో ఇల్లు చేరింది. సోదరులను చూసి విలపించింది. కారణం తెలుసుకొన్న జ్ఞానదేవులవారు "విశోబా కూడా మనవాడే అన్యుడు కాడు" అని ముక్తాబాయిని స్నానం చేసి మడి కట్టుకొమ్మన్నారు. విశోబా ఏమి జరుగుతుందో అని జ్ఞానదేవుల ఇంటి దాపున ఉండి గమనిస్తున్నాడు.

జ్ఞానదేవుడు సిద్ధాసనంలో కూర్చుని ధారణచేసి జఠరాగ్నిని ప్రజ్వలింప చేసాడు. అతని నోటినుండి అగ్నిజ్వాలలు భగ్గున ఎగిశాయి. అతని వీపు వేడిచే కనకనలాడుతోంది. భక్ష్యములను తయారు చేసుకొమ్మన్నాడు. ముక్తాబాయి బొబ్బట్లు తయారు చేసింది. జ్ఞానదేవుడు జఠరాగ్నిని ఉపశమనం చేసుకొని భగవధ్యానం చేస్తున్నాడు. సాధువులందరికి విస్తళ్ళు వేసి తాము కూడా వారి

పంక్తిలో కూర్చున్నారు. ముక్తాబాయి పదార్థాలను వడ్డించింది. అందరూ పరిషేచనములు చేసి భుజిస్తున్నారు. ఇది చూసి విశోబా తన అవివేకానికి చింతించి వారిని శరణు పొందటమే తక్షణ కార్యమని తలచి లోపలికి వెళ్ళి జ్ఞానదేవుని విస్తరిలోని ఒక కబళాన్ని కన్నులకద్దుకొని నోటబెట్టుకొని మింగాడు. జ్ఞానదేవుడు "ఏమిరా నీవు ఖేచరుడుగా ఉన్నావు. ఛీ! ఇక్కడ నుండి వెళ్ళిపో" అన్నాడు. విశోబా ఆ మాటలను తత్వోపదేశంగా గ్రహించి వారికి నమస్కరించి క్షమాపణ వేడి ప్రపంచ వ్యాపారాలను మాని భగవంతుని యందే చిత్తమును నిలపి సాధన చేస్తున్నాడు. జ్ఞానదేవుడు ఖేచరుడు అనుట చేత అతనికి విశోబా ఖేచరుడను నామము ప్రసిద్ధమైంది.

ఒకనాడు విశోబా జ్ఞానదేవుల కడకు వచ్చి స్వామీ! మీ అనుగ్రహం వల్ల నేను కృతార్థుడనైనాను. మీ శేష ప్రసాద మహిమ చేత నాలోని దుర్గుణాలు నశించాయి. నాకు ఉపదేశం చేయండి అని ప్రార్థించాడు. జ్ఞానదేవుడు మందహాసం చేసి "అయ్యా! బ్రహ్మమే తాను  అనే నిశ్చయంచేత దశేంద్రియాలకే కారణమైన మనస్సును నిగ్రహించి, అరిషడ్వర్గాన్ని జయించి, నిర్మల బ్రహ్మాకార వృత్తి చేత కేవల పరిపూర్ణ తత్వ స్వరూపమును దర్శించి ఆనందమయుడు కమ్ము" ని ఆశీర్వదించాడు.

ఆధ్యాత్మిక ప్రచారం చేస్తూ ముముక్షువులను సక్రమ మార్గంలో నడిపిస్తూ జ్ఞానదేవులు తీర్థయాత్రలు చేసి అలందికి తిరిగి వచ్చారు.

తన ఇరువది ఒకటవ ఏట భక్తులందరూ గొలుచుచుండగా జీవసమాధి అయ్యారు. చేతిలో జపమాలను పట్టుకొని భగవద్గీత తొమ్మిదవ అధ్యాయాన్ని పారాయణ చేసి సమాధిలో పద్మాసనస్థుడై ధ్యానంలో నిమగ్నమైనాడు. నివృత్తినాథుడు ఆ సమాధిపై రాతిబండ ఉంచి సమాధి చేశాడు.

జ్ఞానేశ్వరులవారు ఆ సమాధి యందు సజీవులై ముముక్షువులకు మార్గదర్శకులై ఉన్నారని అనంతకోటి భక్తజనుల విశ్వాసము.

సమాప్తము

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL